


వందనమమ్మా.. మహాచండీ..







భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



అంతరాలయం ప్రధాన ద్వారానికి పుష్పాలంకరణ





హారతులందుకుంటున్న భక్తులు

జన చండిక.. జయ చంద్రిక..

- మహాచండీ దర్శనం.. భక్తజన పావనం
- ఐదు రోజుల్లో 3.60 లక్షల మంది రాక
- రేపు దుర్గమ్మను దర్శించుకోనున్న ముఖ్యమంత్రి

ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి, భవానీపురం, కృష్ణలంక, చిట్టినగర్: ఇంద్రకీలాద్రిపై దసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం శ్రీమహాచండీదేవి రూపంలో దుర్గమ్మ దర్శనమిచ్చింది. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 వరకూ 80 వేల మందికి పైగా భక్తులు మహాచండీదేవిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోజంతా సాఫీగా దర్శనాలు సాగిపోయాయి. ఐదు రోజుల ఉత్సవాల్లో మొత్తం 3.60 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఐదు రోజుల్లో ఆలయానికి ప్రసాదాలు, టిక్కెట్లు, కేశఖండన, ప్రత్యేక పూజలు, చీరల వేలం సహా అన్నింటిపైనా కలిపి రూ.2.50 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది.

అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఇందుకు పోలీసులు, దుర్గగుడి అధికారులు భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి ఆలయానికి రానున్నారు. ఐదు రోజుల వేడుకల్లో కనుల పండువగా నగరోత్సవం జరిగింది. పెద్దఎత్తున భక్తులు నగరోత్సవాన్ని తిలకించేందుకు ప్రత్యేకంగా ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. దుర్గాఘాట్‌లో ప్రతిరోజు నదీ హారతి కొనసాగుతోంది. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం తరలివచ్చి నదీ హారతిని వీక్షిస్తున్నారు.

నేడు మహాలక్ష్మీదేవి రూపం..

★ దుర్గగుడి శరన్నవరాత్రి వేడుకల్లో మంగళవారం దుర్గమ్మ మహాలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనుంది.

దర్శన వేళలు:
ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు...




కొండపై క్యూలైన్లలో భక్తుల రద్దీ



నడవలేని భక్తులను వీల్‌చైర్‌లో దర్శనానికి తీసుకెళుతూ..





కమనీయం.. నగరోత్సవం





కడియం నర్సరీ రైతు ఆధ్వర్యంలో ఉచిత వన ప్రసాద పంపిణీ



కోలాట నృత్యంతో సందడి...



నగరోత్సవంలో మంగళ వాయిద్యకారుల సంకీర్తనాలాపన



ఆది దంపతులకు నృత్యాంజలి

అడగొద్దు.. అడుగేయొద్దు!

ప్రజాప్రతినిధుల మద్యం సిండికేట్ల వ్యవహారం

పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల జోక్యం

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే బృందం



మద్యం వ్యాపారానికి రాజకీయ నేతలకు విడదీయరాని అనుబంధం. ఇందులో ఎక్కువగా రాజకీయ నేపథ్యం ఉన్న వారే పెత్తనం చెలాయిస్తుంటారు. నూతన మద్యం విధానంలో భాగంగా ఇటీవల ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో చాలా చోట్ల ప్రజాప్రతినిధులు, నేతల చూపు మద్యం దుకాణాలపై పడింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కీలక నేతలు దరఖాస్తు చేయకుండా అడ్డుకుంటున్నారు. తామే వ్యాపారం చేయాలనీ, ఇతరులు అడుగుపెట్టకూడదని శాసిస్తున్నారు. పలు చోట్ల సిండికేట్ కడుతున్నారు. దీంతో దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి జమ కావాల్సిన రాబడికి గండి పడుతోంది. దరఖాస్తులు సమర్పించేందుకు మరో రెండు రోజులే ఉండడంతో ప్రజాప్రతినిధులు తామే దుకాణాలను చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

ఉమ్మడి పెట్టుబడులు.. ఆపై సమాన వాటాలు

విజయవాడ నగరంలో మొత్తం 39 దుకాణాలను ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసింది. వీటిని కైవసం చేసుకునేందుకు పలువురు రింగ్ అయి ప్రయత్నిస్తున్నారు. నగరంలోని ఓ నియోజకవర్గానికి చెందిన డివిజన్ స్థాయి ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ప్రధానమైన సిండికేట్ ఒకటి. మొత్తం 70 మంది సభ్యులు ఈ సిండికేట్‌లో ఉన్నారు. నగరంలోని 39 దుకాణాలకు వీరు టెండర్లు వేయాలని నిర్ణయించారు. సిండికేట్‌లోని ఐదుగురు కలిసి ఒక్కో దుకాణానికి వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇంకా ఎవరైనా తమతో వస్తే.. చేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో ఎవరికి దుకాణం వచ్చినా.. అందరూ కలసి పెట్టుబడులు పెట్టి సమాన వాటాలు తీసుకునేలా అవగాహనకు వచ్చారు.

రెండు జిల్లాల్లో మద్యం దుకాణాలు, ఇప్పటి వరకు దరఖాస్తులు (సోమవారం రాత్రి 9 గంటల వరకు..)		
జిల్లా	దుకాణాలు	దరఖాస్తులు
ఎన్టీఆర్	113	1,565
కృష్ణా	123	545

ఒక దుకాణం.. 10 మంది బినామీలు..

మరో నియోజకవర్గంలో మాజీ కార్పొరేటర్ ఒకరు ఒక దుకాణానికి దరఖాస్తు చేస్తున్నారు. ఇందుకు 10 మంది బినామీలను సిద్ధం చేశారు. వీరితో దరఖాస్తులు చేయిస్తున్నారు. ఎవరికి వచ్చినా ఈ నేత వ్యాపారం నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నారు. పెట్టుబడి ఇతనే సమకూరుస్తున్నారు. నగరంలో మరో కీలకమైన సిండికేట్ ఇప్పటికే బార్లను నడుపుతోంది. ఇందులో సభ్యులు కొందరితో జట్టు కట్టి షాపులు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. విజయవాడలో విపరీతమైన పోటీ ఉంది. ప్రధానంగా కృష్ణలంక, పాయకాపురం, న్యూ రాజరాజేశ్వరీపేట, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లోని దుకాణాలకు విపరీతమైన డిమాండ్ ఉంది.

ఇటు రావద్దని హెచ్చరికలు

● **ఉయ్యూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని** మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న వారికి ఓ కీలక నేత అనుచరులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. తమకు చెప్పకుండా దరఖాస్తులు దాఖలు చేయవద్దని హుకుం జారీ చేస్తున్నారు. ఆ నేత తాలూకు వారు మాత్రమే మద్యం దుకాణాలు పొందేలా సిండికేట్ అవుతున్నట్లు సమాచారం.

● **గుడివాడలో** ఓ నేత తమ అనుచరులకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నట్లు తెలిసింది. దీంతో వారు ఒక్కటై దరఖాస్తులు పెట్టుకుంటున్నట్లు సమాచారం.

● **గన్నవరం పరిధిలో** 29 దుకాణాలకు నామమాత్రంగానే దరఖాస్తులు వచ్చాయి. ఎవరినీ దరఖాస్తు చేయొద్దని కీలక నేత వర్గీయులు ఇప్పటికే ఔత్సాహికులకు గట్టిగా చెప్పారు. తాము గతంలోనూ ఇదే వ్యాపారం చేసే వారమని మొత్తుకున్నా వేయడానికి వీల్లేదని ఖరాకండిగా చెప్పేశారు. గన్నవరం ఎక్సైజ్ కార్యాలయంలో మకాం వేసి.. బయటి వ్యక్తులు దరఖాస్తులు సమర్పించకుండా పహారా ఏర్పాటు చేయడం గమనార్హం. దరఖాస్తు చేసేందుకు కొందరు సోమవారం వెళ్లగా వీరు అడ్డగించారు. వెనక్కు వెళ్లిపోవాలని రుబాబు చేశారు. చివరకు.. ఆ కీలక నేత సన్నిహితుల్లో ఒకరికి ఫోన్ చేయగా, దరఖాస్తు చేయడానికి అనుమతించారు. తాము చెప్పిన విధంగా నడుచుకోవాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం.

● **పెడన పురపాలిక పరిధిలో** సోమవారం సాయంత్రం వరకూ ఒక దుకాణానికి దరఖాస్తులు రాలేదు.

● కృత్తివెన్ను మండలంలో 3, అవనిగడ్డలో 1, నందివాడలో 3, గుడివాడ పట్టణంలో 1, పామర్రులో 1, బాపులపాడులో 3 దుకాణాలకు దరఖాస్తులు రాలేదు.

సాంకేతికత తోడుగా... సేవలు మెండుగా!



ఈనాడు - అమరావతి

దుర్గమ్మ దర్శనార్థం లక్షలాదిగా వస్తున్న భక్తుల నియంత్రణకు నగర పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పుష్కలంగా వినియోగిస్తున్నారు. తద్వారా బందోబస్తులో పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు సత్ఫలితాలు సాధిస్తున్నారు. వెరసి ఏటా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెడుతున్నారు. ఆలయ సమీపంలో మోడల్ అతిథి గృహంలో ప్రత్యేకంగా ఉత్సవాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి.. దర్శన సమయాలు, ట్రాఫిక్ రద్దీ, సీసీ కెమెరాలు, వీఐపీల దర్శనాలు, తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు.



కంట్రోల్‌రూంలో సీసీ ఫుటేజ్‌ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ రాజశేఖర్‌బాబు

నిరంతరం అప్రమత్తత...

మొత్తం 150 సీసీ కెమెరాలను మోడల్ గెస్ట్ హౌస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. ఇక్కడ 24 గంటలూ విధుల్లో ఉండే సిబ్బంది. . ఏవైనా సమస్యలు ఎదురైతే.. మైక్ నుంచి పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా అన్ని ప్రాంతాలకు సందేశాలు పంపి అక్కడి వారిని అప్రమత్తం చేసే వీలుంది. వీహెచ్ఎఫ్ (వెరీ హై ఫ్రీకెన్సీ) సెట్ ద్వారా ఆయా ప్రాంతాల్లో విధుల్లోని సిబ్బందికి రద్దీ నియంత్రణ, తొక్కిసలాట, ఇతర జాగ్రత్తలపై సూచనలు ఇస్తున్నారు. తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ తెలపాలని వారి తల్లిదండ్రులకు కంట్రోల్ రూమ్‌కు వస్తున్నారు. కనిపించకుండా పోయిన ప్రాంతంలో సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు పరిశీలించి. . వారిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు పది మందిని కనుగొని, పెద్దల చెంతకు చేర్చారు.



డ్రోన్లతో ప్రత్యక్ష పరిశీలన..

రోజురోజుకు భక్తుల రద్దీ పెరగడంతో.. దానికి తగ్గట్లుగా సిబ్బందిని సిద్ధం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో క్యూలైన్లు, ట్రాఫిక్, భక్తుల రద్దీ ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ప్రతి 15 నిమిషాలకోసారి వీటిని ఎగరేస్తున్నారు. తద్వారా వచ్చే దృశ్యాల ఆధారంగా వాస్తవ పరిస్థితులు అంచనా వేసేందుకు బాగా అక్కరకొస్తోంది.

ట్రాఫిక్ సమస్యలపై 'అస్త్రం'

నగరంలో కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటోంది. ఉత్సవాలకు రద్దీ సమస్యలు తగ్గించేలా ట్రాఫిక్ పోలీసులకు అక్కరకొచ్చేలా సీపీ రాజశేఖర్‌బాబు.. 'అస్త్రం' అనే మొబైల్ యాప్‌ను తెచ్చారు. దీంతో ఉన్నతాధికారులు ముఖ్య కూడళ్లలో ఏ సమయానికి ఎంత రద్దీ ఉంది? ఎంత దూరం వాహనాలు బారులు తీరాయనేది.. యాప్‌లో పరిశీలించి, ఆ కూడళ్లలో ఒత్తిడి తగ్గించేందుకు పోలీసులకు ఉపయోగపడుతోంది. ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల మళ్లింపు, అదనపు సిబ్బందిని పంపి నియంత్రణకు తోడ్పడుతోంది.

యాప్‌తో వీఐపీ దర్శనాల పాస్‌ల జారీ

ఏటా అమ్మవారి దర్శనానికి పోటెత్తే వీఐపీల కారణంగా సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈసారి ఇలాంటి కష్టాలను తప్పించి, నియంత్రించేలా ప్రత్యేక యాప్‌ను పోలీసులు రూపొందించారు. దర్శనానికి వెళ్లే వీఐపీలు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలి. రిజిస్టర్ కాగానే పాస్ రూపంలో క్యూఆర్ కోడ్ వస్తుంది. దీనిని ఆలయం వద్ద స్కాన్ చేసి, దర్శనానికి వెళ్తున్నారు.

దర్శన సమయాల లెక్కింపు..

క్యూ లైన్లలో తొక్కిసలాట నియంత్రణకు, ఎక్కువ సమయం నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు కూడా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. ఉచిత, రూ.100, రూ.300, రూ.500 టిక్కెట్లు తీసుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి పట్టే సమయాన్ని కచ్చితంగా లెక్కించి.. కంట్రోల్ రూమ్‌కు చేరుస్తున్నారు. దీంతో ఏ సమయానికి వెళ్తే ఎంతసేపటికి దర్శనం అవుతుందనే సమాచారం భక్తులకు ఉపకరిస్తోంది. మూలా నక్షత్రం రోజు భక్తుల అధిక రద్దీకి వీలున్నందున క్యూలైన్లలో కంపార్ట్‌మెంట్లను, ఆ మేరకు బందోబస్తు పెంచబోతున్నారు.

సమష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, వేదికపై కలెక్టర్, శాసనసభ్యులు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా సమష్టి కృషితో జిల్లాలను అభివృద్ధి చేసుకుందామని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047' విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాసనసభ్యులతో కార్యశాల నిర్వహించారు. తొలుత కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో జిల్లా స్థూల ఉత్పత్తి 15 శాతం పెంచే లక్ష్యంతో ప్రజాప్రతినిధుల సలహా, సూచనల కోసం సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌ను నవంబరు ఒకటో తేదీన సీఎం విడుదల చేస్తారన్నారు. హంసలదీవి, ఘంటసాల, మంగినపూడి బీచ్ వంటి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ పెనమలూరు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యామ్నాయ రహదారులను వృద్ధి చేయాలన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ బ్రహ్మలింగయ్య చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, మల్లవల్లి పారిశ్రామికవాడ విస్తరణకు భూమి సేకరించాలన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ లంక గ్రామాల్లో వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆక్వా రంగ ప్రగతికి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చినగొల్లపాలెంను పర్యాటక పరంగా అభివృద్ధి చేయాలని కోరారు. డీఆర్వో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా పనులకు డీఎంఎఫ్ నిధులు వినియోగించాలి

జిల్లా ఖనిజ ఫౌండేషన్(డీఎంఎఫ్) నిధులను ప్రాధాన్యతా పనులకు వినియోగించాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. ఖనిజ నిధుల వినియోగంపై కలెక్టరేట్‌లో శాసనసభ్యులతో కలిసి మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందుబాటులో ఉన్న రూ.20 కోట్ల నిధులను నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ భవన నిర్మాణానికి, ఫిల్టర్‌బెడ్‌ల ఏర్పాటుకు నిధులు కేటాయించేలా చూడాలన్నారు.

మద్యం దుకాణాల లాటరీ వేదిక మార్పు



మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస చౌదరి, ఈఎస్ గంగాధర్

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులను లాటరీ తీసే వేదికను మార్చినట్టు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి తెలిపారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఈఎస్ జి.గంగాధర్, ఏఈఎస్ సి.భార్గవ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం వరకూ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. మొత్తం 123 దుకాణాలకు ఇప్పటి వరకూ 360 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారని, 14 దుకాణాలకు సోమవారం సాయంత్రం వరకూ ఒక్క దరఖాస్తూ అందలేదన్నారు.

11న నోబుల్ కళాశాలలో ప్రక్రియ

లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించే ప్రక్రియను ఈనెల 11న తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు లాటరీ తీసే ప్రక్రియను కలెక్టరేట్ ప్రాంగణం నుంచి నోబుల్ కళాశాలకు మార్చినట్టు తెలిపారు. ఉదయం 8.00 గంటల నుంచే లాటరీ తీసే కార్యక్రమం మొదలవుతుందని, రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం 1.00గంటకు ప్రక్రియ మొత్తం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. దీని నిమిత్తం జిల్లా స్థాయి రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఎనిమిది కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. టెండరు దక్కించుకున్న వారు అదే రోజు చెల్లించాల్సిన లైసెన్స్‌ఫీజులో ఆరో వంతు చెల్లించేందుకు వీలుగా కళాశాలలోనే ప్రత్యేక బ్యాంకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. లైసెన్స్ ఫీజు చెల్లించిన వారు వెంటనే వ్యాపారం చేసుకునేందుకు వీలుగా 15 రోజులు పాటు చెల్లుబాటులో ఉండే ప్రొవిజినల్ లైసెన్స్ ఇస్తారని చెప్పారు.

ఖనిజ నిధులు సద్వినియోగం చేయాలి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లా ఖనిజ నిధి నుంచి మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాలని, ఆ నిధులను ప్రజల ప్రాధాన్యతా అవసరాలకోసం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు స్పష్టంచేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఖనిజ నిధి(డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాల కోసం 55 శాతం, రహదారులు, వంతెన నిర్మాణాలకు 40 శాతం నిధులు కచ్చితంగా కేటాయించాలన్నారు. గనులశాఖ డీడీ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో గీతాబాయి, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.
★ సామూహిక ఎలుకల నివారణకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారిణి పద్మావతి, ఉద్యానవనశాఖా ధికారిణి జ్యోతి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైకాపావన్నీ అసత్య ప్రచారాలే : కొల్లు

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉచిత ఇసుక అందించడంతో పాటు తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని తెస్తామని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక, మద్యం విషయంలో విచ్చలవిడి దోపిడీకి పాల్పడ్డ గత వైకాపా పాలకులు ఉచిత ఇసుక విధానంపై అసత్య ప్రచారాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. వైకాపా పాలకుల స్వార్థపూరిత చర్యల వల్లే ఇసుక రవాణా ఖర్చులు అధికంగా భరించాల్సి వస్తోందన్నారు. కృష్ణా, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల పరిధిలో ఇసుక స్టాక్ యార్డ్‌లను నిర్వీర్యం చేశారన్నారు. ఎన్‌జీటీ నిబంధనల మేరకు వర్షాకాలం రీచ్‌ల నుంచి ఇసుక తీసే పరిస్థితి లేదన్నారు. దీంతో దూరంగా ఉండే స్టాక్ యార్డ్ నుంచి రవాణా చేసుకోవాల్సి రావడంతో ఆర్థికంగా కొంత భారం అవుతోందన్నారు.

పారదర్శంగా కేటాయింపు

గతంలో మద్యం ద్వారా దోపిడీకి పాల్పడిన వ్యక్తులు సిండికేట్ అయ్యే కుయుక్తులు పన్నుతూ ప్రభుత్వాన్ని విమర్శించేలా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వారి ఆటలు సాగవని, అత్యంత పారదర్శకంగా దుకాణాల కేటాయింపు ఉంటుందన్నారు. ఎవరైనా పిచ్చి ప్రయత్నాలు చేస్తే ఏ స్థాయి వారైనా కఠిన చర్యలకు గురి కావాల్సిందే అని హెచ్చరించారు. రాష్ట్రంలో మొత్తం 3,336 దుకాణాలకు టెండర్లు పిలిస్తే సోమవారానికి 20,000 పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. రెండో ఫేజ్‌లో భాగంగా గీత కార్మికుల కోసం 340 దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని అమరావతి నుంచి పోర్టు వరకు జల రవాణా కోసం ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఏర్పాటుతో పాటు తెలంగాణ రాష్ట్రం కోదాడ వద్ద డ్రైపోర్టు ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల వ్యవధిలోనే మచిలీపట్నం నగర అభివృద్ధికి రూ.16 కోట్లు కేటాయించిందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని)కి సవాల్ విసిరారు.

దుకాణాల లైసెన్స్‌కు భారీ స్పందన

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 1100 దరఖాస్తులు

గన్నవరం ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, పక్కన సీఐ డి.సురేఖ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల లైసెన్స్‌లకు భారీ స్పందన వస్తోందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు అన్నారు. గన్నవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లో మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. స్టేషన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ డి.సురేఖతో కలిసి డీసీ శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మొత్తం 236 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 1100కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. గన్నవరం ఎక్సైజ్ పరిధిలో 23 దుకాణాలకు 35 దరఖాస్తులు వచ్చాయన్నారు. 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ, 11వ తేదీ మచిలీపట్నం, విజయవాడలో లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు మంజూరు చేయనున్నట్లు వివరించారు. సిండికేట్లకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్టేషన్ బయట సోమవారం కొందరు దరఖాస్తుదారులను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని సమాచారం రాగానే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరాకు చర్యలు చేపట్టండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఉచిత ఇసుక సరఫరా జిల్లాలో సక్రమంగా నిర్వహించేలా ఏజెన్సీలను ఖరారు చేయాలని కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో పలు సూచనలు చేశారు. రీచ్‌ల్లో ఇసుక తవ్వి, వాహనాల ద్వారా సమీపంలోని స్టాక్ యార్డుకు చేర్చడం, రవాణా నిమిత్తం ర్యాంపుల ఏర్పాటు, అప్రోచ్ రహదారుల నిర్వహణ, స్టాక్ యార్డుల్లో వినియోగదారుల వాహనాలకు ఇసుక లోడింగ్ వంటి చర్యలు చేపట్టేందుకు ఏజెన్సీల కోసం నిర్ణీత వ్యవధిలో టెండరు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఏజెన్సీని ఖరారు చేసేందుకు జేసీ అధ్యక్షతన, జిల్లా గనులు, భూగర్భ వనరుల, రవాణా, ఇరిగేషన్ అధికారులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తాడిగడప పురపాలక సంఘానికి మంజూరైన పనులు చేపట్టేందుకు అవసరమైన ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. జేసీ గీతాంజలిశర్మ, ఏఎస్పీ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

కళాశాల ఆస్తుల వ్యవహారంలో ఈడీ విచారణ

గతంలో విశాఖకు వెళ్లిన ఓ విద్యా సంస్థ కరస్పాండెంట్

విజయవాడ, న్యూస్‌టుడే: గుడివాడలోని ప్రముఖ విద్యా సంస్థ వ్యవహారంలో ప్రజాధనం కొంత మందికి భారీగా బదిలీ కావడంతో ఆ కళాశాల బ్యాంకు లావాదేవీలు, నందివాడ గ్రామంలోని పేద ప్రజల బ్యాంకు ఖాతాలను ఈడీ తనిఖీ చేస్తోంది. కొన్ని రోజులుగా ఈడీ పలు విధాలుగా తనిఖీలు చేస్తుండగా పట్టణంలోని ఓ ప్రముఖ కళాశాలకు చెందిన సుమారు 10.89 ఎకరాల పొలాన్ని పాలక మండలికి తెలియకుండా బదిలీ చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. వాస్తవంగా కళాశాల వారు 2012-13లో ఓ భవన నిర్మాణ సంస్థకు 4 ఎకరాలను ఎకరం రూ.50 లక్షలకు చొప్పున విక్రయించారు. ఆ తర్వాత 2.34 ఎకరాలను కళాశాల కరస్పాండెంట్‌కు, అతని భార్యకు 8.56 ఎకరాలను ఎకరం రూ.20 లక్షలకు విక్రయించారని.. కళాశాల బైలా ప్రకారం ఇది అక్రమమని ప్రస్తుత పాలకవర్గంపై గతంలో కొందరు కోర్టును ఆశ్రయించారు. అలాగే విద్యా సంస్థ ఆవరణలో ఒక ఏసీ కల్యాణ మండపం నిర్మించి దానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై పన్నులు చెల్లించడం లేదని.. రూ.95 లక్షల పన్ను చెల్లించాలని అమ్మకపు పన్ను శాఖ ఇచ్చిన నోటీసుపై విచారణ నడుస్తోంది. కళాశాల ఆదాయ వనరుల నుంచి కళాశాల సిబ్బందికి రూ.18 లక్షలు జీతాలు చెల్లిస్తూ రూ.36 లక్షలు చెల్లించినట్లు దొంగ లెక్కలు చూపుతున్నారని.. ఈ వ్యవహారంలో కూడా ఆదాయ పన్ను చెల్లించకపోవడంతో ఆ శాఖ రూ.23 కోట్లకు నోటీసులిచ్చినట్లు తెలిసింది. దీనికి సంబంధించి కళాశాల యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పెద్ద మొత్తంలో ప్రజాధనం దారిమళ్లించారనే అనుమానంతో ఈడీ జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నందివాడ గ్రామానికి చెందిన 20 మందికిపైగా పేదలు రూ.లక్షల్లో కళాశాల సొసైటీకి అప్పుగా ఇచ్చి లెక్కలు చూపారు. దీంతో పేదల బ్యాంకు ఖాతాల నుంచి జరిగిన అక్రమ లావాదేవీలపై వారం రోజులుగా ఈడీ విచారణ చేస్తోంది. ఇందులో భాగంగా కొద్ది రోజుల కిందట ఈడీ అధికారులు కళాశాల కరస్పాండెంట్‌ను విశాఖ కార్యాలయానికి పిలిపించినట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

కాత్యాయనీదేవిగా కొండలమ్మ





పూజలు చేస్తున్న జిల్లా జడ్జి అరుణసారిక

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా వేమవరం కొండలమ్మ దేవస్థానంలో సోమవారం అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సహస్రనామ కుంకుమార్చన, సూక్తహవనం, కాలసర్పదోష నివారణకు కాత్యాయనీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం తాడూరు, భోగిరెడ్డిపల్లి వారిచే భజన కార్యక్రమాలు, సాయంత్రం ఊంజల్ సేవ, పంచహారతులు, రాత్రికి కూచిపూడికి చెందిన అభినయ అకాడమిచే కూచిపూడి నాట్యం, ఎ.కొండూరు మోడల్ స్పెషల్ రెసిడెన్షియల్ ఆశ్రమంచే భక్తి సంగీత విభావరి ప్రదర్శించినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. అమ్మవారిని జిల్లా జడ్జి అరుణసారిక, జిల్లా రిజిస్ట్రార్ వీవీఎస్ఆర్.ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తదితర ప్రముఖులు దర్శించుకొని పూజలు చేశారు.

వీఆర్‌కు కోడూరు ఎస్సై



శిరీష



కె.చాణక్య

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు ఎస్సై పి.శిరీషను జిల్లా ఎస్పీ వీఆర్‌కు పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొద్ది రోజుల కిందట ఎస్ఐ శిరీష పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో తన పుట్టిన రోజును నిర్వహించుకున్నారు. దీంతో ఆమెను వీఆర్‌కు పంపించినట్లు తెలిసింది. మచిలీపట్నం రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న కె.చాణక్యను కోడూరుకు బదిలీ చేశారు. శిరీష విధుల నుంచి సోమవారం రిలీవ్ కాగా, చాణక్య నూతన ఎస్సైగా సోమవారం విధుల్లో చేరారు.

మచిలీపట్నం

● మచిలీపట్నం ● పెడన

వరద బాధితులకు సాయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: విజయవాడలో బుడమేరు వరద బాధితులకు ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయం అందించారు. సంఘ నాయకులు కొల్లు సాయిమోహన్‌రావు, ఆర్. రాజారామ్, తమ్ము విశ్వేశ్వరరావు, మహ్మద్‌మునీర్, టి.గిరీష్ బాబు తదితరులు పాల్గొని రూ.30వేల చెక్కును సోమవారం మంత్రి కొల్లు రవీంద్రకు అందజేశారు. ఈసందర్భంగా వారిని మంత్రి అభినందించారు.


మంత్రికి చెక్కు అందజేస్తున్న సంఘ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

సమస్య: నగరంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో చెత్త, వ్యర్థాలు గుట్టగా వేసి వదిలేశారు. దీంతో అక్కడకు వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.
-వెంకటేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి వెంటనే చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **-మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మచిలీపట్నం నగరపాలకసంస్థ**

-మచిలీపట్నం కార్పొరేషన్, గూడూరు, న్యూస్‌టుడే

కొళాయికి మరమ్మతులు

స్పందనకు వందనం

గూడూరు మండలం పోసినవారిపాలెం పంచాయతీ కార్యాలయ సమీపంలో రహదారి పక్కన ఉన్న పబ్లిక్ కుళాయికి ట్యాప్ విరిగిపోవడంతో నీరు వృథాగా పోతుంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి స్థానికులు తీసుకురాగా..అధికారులు స్పందించి కొత్త ట్యాప్ ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు నైపుణ్య పరీక్ష నిర్వహణ

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు గ్లోబల్ ఎంప్లాయిబులిటీ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు, విద్యా సంస్థలు నిర్ణీత క్యూఆర్ కోడ్ లేదా లింకులో నమోదు చేసుకోవాలని సూచించారు. ఫలితాల ఆధారంగా ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కార నైపుణ్యాలు, భాషా నైపుణ్యాలు, అర్థమెటిక్స్, రీజినింగ్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై తర్ఫీదు ఉంటుందన్నారు. ఈ నెల 30 లోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్ష తేదీ త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

17 నుంచి ఏఎన్‌యూ పరీక్షలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్య పరీక్షలు ఈ నెల 17 నుంచి జరుగుతాయని స్థానిక విజయానంద డిగ్రీ స్టడీ సెంటర్ సమన్వయకర్త ఏ.నాగమల్లేశ్వరరావు తెలిపారు. రెగ్యులర్, సప్లిమెంటరీ సెమిస్టర్ బ్యాచ్‌లకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. 1, 3 సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 17 నుంచి 26 వరకు, 2, 4 సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 27 నుంచి నవంబర్ 6 వరకు, ఐదో సెమిస్టర్ విద్యార్థులకు నవంబర్ ఏడు నుంచి 16 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

సినిమాలు

రేవతి – సత్యం సుందరం
మినీరేవతి – రామ్‌నగర్ బన్నీ
సిరివెంకట్ – దేవర
రామరాజు– స్వాగ్

- మచిలీపట్నం కార్పొరేషన్

చెత్త తరిగేలా..నగరం మెరిసేలా

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే:

వైకాపా పాలకుల అలసత్వం కారణంగా నగరంలో వ్యర్థాల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రధానంగా డంపింగ్ యార్డు నుంచి చెత్త తరలించే ప్రక్రియ చేపట్టకపోవడంతో చెత్త కొండలా మేట వేసుకుపోయింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు మచిలీపట్నం పర్యటనలో భాగంగా ఇక్కడి యార్డును పరిశీలించి వెంటనే చెత్త తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ చొరవ తీసుకుని సమస్య పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టారు.

చురుగ్గా 'బయో మైనింగ్' పనులు..

నగరంలో అన్ని డివిజన్ల నుంచి రోజూ 84 టన్నులకు పైగా చెత్త వస్తోంది. దీని తరలింపునకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.3 కోట్లు కేటాయించారు. గత

నగరంలో ఇలా..

డివిజన్లు	50
జనాభా	1.80 లక్షలు
ఇళ్లు	56 వేలు
నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త	84 టన్నులు
రోజూ జిందాల్ ప్లాంట్‌కు వెళ్లే చెత్త	18 టన్నులు
బయో మైనింగ్ చేసిన చెత్త	52 వేల మెట్రిక్ టన్నులు
ఇంకా మిగిలింది	లక్ష మెట్రిక్ టన్నులు


ఇటీవల డంపింగ్ యార్డును పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వైకాపా ప్రభుత్వ హయాంలో నత్త నడకన సాగిన ఈ పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వేగం పుంజుకున్నాయి. దీంతో గుత్తేదారుకు అప్పగించిన బాధ్యతల ప్రకారం 52 వేల మెట్రిక్ టన్నుల చెత్తకు బయో మైనింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఇంకా డంపింగ్ యార్డులో లక్ష మెట్రిక్ టన్నులు మిగిలి ఉంది. దాన్ని కూడా శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నారు. త్వరలోనే టెండర్లు కూడా పిలిచే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

'స్వచ్ఛ మచిలీపట్నం' దిశగా అడుగులు

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ

రోజూ ఉత్పత్తయ్యే చెత్తలో కేవలం 18 టన్నులు మాత్రమే జిందాల్ ప్లాంటుకు పంపించగలుగుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇంటి నుంచే తడి, పొడి చెత్త విభజన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తొలుత డివిజన్ల వారీగా సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను చైతన్యం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

మీ ఇంటి కొడుకుగా విజ్ఞప్తి చేస్తున్నా.. -డీకే బాలాజీ, కలెక్టర్



ఇంటి వద్దే తడి, పొడి చెత్త విభజన జరగాల్సిన అవసరం ఉంది. అలా చేస్తే కంపోస్ట్ ఎరువు చేయడంతోపాటు రీసైక్లింగ్ చేసే సంస్థలకు వ్యర్థాలను తరలించవచ్చు. దీని వల్ల డంపింగ్ యార్డులో చెత్త మేట పేరుకుపోకుండా ఉంటుంది. మీ ఇంటి కొడుకుగా విజ్ఞప్తి చేస్తున్నా. స్వచ్ఛ నగరం సాధనకు అందరూ సహకరించండి.

అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చే అర్జీలు పునరావృతం కానీయకుండా చూడాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను సూచించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీల పరిష్కార విషయంలో ఇబ్బందులుంటే వాటిని అర్జీదారులకు తెలియజేయాలన్నారు. పరిష్కారయోగ్యమైన అంశాలను సత్వరం సంతృప్తికర పరిష్కారం చూపాలని, ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకునే పరిస్థితి రానీయొద్దని స్పష్టం చేశారు. రెండు నెలల వేతన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. బంటుమిల్లి మండల పరిధిలోని చోరంపూడి కాల్వపై శిథిలమైన ... పునర్నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ... రైతు సంఘ నాయకులు గొరిసెట్టి నాగేశ్వరరావు, తదితరులు వినతి సమర్పించారు. * ధాన్యం నగదు చెల్లించకుండా రమారమి 50 మంది రైతులకు రూ.2.50 కోట్ల మేర ఎగవేసిన గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి వెంకటేశ్వరరావుపై తగు చర్యలు తీసుకోవాలని నాగాయలంక మండలం పర్రచివర గ్రామానికి చెందిన బాధిత రైతులు సమస్యలు, వెంకయ్య, తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ పరమైన అంశాలతో పాటు, వివిధ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ దాదాపు 135 మంది అర్జీలు అందజేశారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలి

అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో నూరుశాతం పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టంచేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల బదిలీల్లో భాగంగా చాలామంది అధికారులకు కొత్తగా వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయా శాఖల పరంగా పరిపూర్ణ అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు.

'ప్రజా దర్బార్'కు వినతుల వెల్లువ

పెడన, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పెడనలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఓ.అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఎస్సై సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు అర్జున్, తెలుగుదేశం నేతలు ... తదితరులు పాల్గొన్నారు. పెడన మండలం ... రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ★ చేవేంద్రలో గుంతలు తేలిన ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేయించాలని కూనపరెడ్డి అంకమ్మరావు కోరారు. ★ బంటుమిల్లి మండలం నాగన్నచెరువులో భోగేశ్వరం మురుగు కాలువపై వంతెన నిర్మించాలని, తాగునీటి సరఫరా చేయాలని, అంతర్గత రోడ్లను ఆధునికీకరించాలని సర్పంచి తమ్మిశెట్టి అరుణకుమారి అర్జీ అందజేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

రైతుబజార్లలో రాయితీ ధరకు టమాటాలు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రైతు బజార్లలో మంగళవారం నుంచి రాయితీ ధరపై టమాటాలు విక్రయిస్తారని జేసీ గీతాంజలిశర్మ తెలిపారు. కుటుంబానికి ఒక్క కిలో రూ.50లకే కొనుగోలు చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు తమ ఆధార్ లేదా రేషన్ కార్డు కాపీలను రైతు బజారు కౌంటరులో చూపి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిరువోలు బుచ్చి రాజు అన్నారు. సోమవారం నగరంలోని ఓ వేడుక మందిరంలో నిర్వహించిన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యశాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. సభ్యత్వ జిల్లా సహప్రముఖ్ నాగలింగం అయోధ్యరామయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరాజు, వేదికపై పలువురు నాయకులు

కేసుల్లో పురోగతి కనిపించాలి

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. దస్త్రాల నిర్వహణలో అలసత్వం చూపొద్దని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. అనంతరం మచిలీపట్నం కోనేరుసెంటర్‌కు వచ్చి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. మూలా నక్షత్రం రోజు శక్తిపటాల ఊరేగింపు సందర్భంగా నిర్వహించాల్సిన బందోబస్తు విధులపై ఆర్.పేట, ఇనగుదురు, చిలకలపూడి సీఐలు, ట్రాఫిక్ ఎస్‌ఐలతో చర్చించారు.


గూడూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తు న్న ఎస్పీ గంగాధరరావు

వరాల తల్లి.. కల్పవల్లి


గుండుపాలెంలో..


ఎస్.ఎన్.గొల్లపాలెంలో లలితాత్రిపుర సుందరి


మంగినపూడిలో స్కందమాత


బంటుమిల్లి : పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో..


బంటుమిల్లి : పెదతుమ్మిడి రామాలయంలో సంతాన లక్ష్మి


బంటుమిల్లి : వేంకటేశ్వర స్వామి గుడిలో..


బంటుమిల్లి : కనకదుర్గమ్మ ఆలయంలో చండీ దేవి


పెడన: దావోజీపాలెంలో మహాచండీదేవిగా..


పెడన: ఇష్టకామేశ్వరి ఆలయంలో పైడమ్మ తల్లి


పెడన దావోజీపాలెంలో మహాచండీ అవతారం


లక్ష్మీపురంలో ఊరేగింపు


గరిశపూడిలో శాకంబరి అలంకరణలో..


కృత్తివెన్ను నాగేశ్వరస్వామి ఆలయంలో..


మచిలీపట్నం: సంతోషీమాతగా కన్యకాపరమేశ్వరి


బందరు త్రిశక్తిపీఠంలో..

న్యూస్‌టుడే బృందం: శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తున్నారు. సోమవారం మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నసమారాధనలు, సామూహిక కుంకుమ పూజలు, చండీ హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


మచిలీపట్నం: బలరామునిపేట విశ్వేశ్వరాలయంలో..


రాయవరంలో సొసైటీ సమీపంలో..


బందరు: గీతామందిరంలో కుంకుమార్చన

సీఎన్‌జీ గ్యాస్ అందుబాటులో ఉంచాలి

మచిలీపట్నం(గొడుగుపేట): నగరంలో సీఎన్‌జీ గ్యాస్ కొరత వల్ల ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 24గంటల్లో గ్యాస్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. గ్యాస్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నాయకులు, ఆటోడ్రైవర్లు ర్యాలీ నిర్వహించి ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సీఎన్‌జీ ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న 500మంది కార్మికులు గత నాలుగు రోజులుగా గ్యాస్ లేక ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బందరులో సీఎన్‌జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఒకటే ఉండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. నాయకులు కరీముల్లా, షేక్ బాజీ, అబ్దుల్‌ఖయ్యూం, కె.శ్రీనివాసరావు, సునీల్‌రాజేష్, రమేష్‌నాయుడు తదితరులతోపాటు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.


నిరసనలో నాయకులు, ఆటో డ్రైవర్లు

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మహిళలు చట్టాల గురించి తెలుసుకొని చైతన్యవంతంగా మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'విధాన్ సె సమధాన్' పేరుతో చట్టాలు, సంక్షేమ పథకాలపై సోమవారం మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. గృహహింస చట్టం, మనోవర్తి, వరకట్నం, సంక్షేమ పథకాలు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలు రూపొందించిందన్నారు. మండల లీగల సర్వీస్ కమిటీ ఛైర్మన్, మొవ్వ జడ్జి పి.రాజన్ ఉదయ్‌ప్రకాష్ మాట్లాడుతూ మహిళలు చట్టాలను తెలుసుకొని, ధైర్యంగా గౌరవమైన జీవితం గడపాలని సూచించారు. రిసోర్స్ సభ్యులు గొరిపర్తి శ్రీనివాసరావు, సరస్వతి, కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ పి.వెంకటశివయ్య, న్యాయవాదులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.వి.రామకృష్ణయ్య, పక్కన మొవ్వ జడ్జి రాజన్ ఉదయ్‌ప్రకాష్, న్యాయవాదులు

పురపాలిక వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం

రవాణా శాఖ నిబంధనలు పాటించని వైనం

పెడన, న్యూస్‌టుడే: మున్సిపల్ ప్రజారోగ్య విభాగంలోని వాహనాలకు రవాణా శాఖ నిబంధనలను అమలు చేయటంలో పూర్తి నిర్లక్ష్యం కన్పిస్తోంది. ప్రజారోగ్య విభాగంలో రెండు కంపాక్టర్లు, ట్రాక్టర్ల ద్వారా పారిశుద్ధ్య చర్యల్ని నిర్వహిస్తారు. అలాగే తాగునీటి సరఫరాకు మరో ట్రాక్టర్‌ను ప్రత్యేకంగా వినియోగిస్తారు. ఈ వాహనాలు దాదాపు పదేళ్ల క్రితం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూరగా ఇప్పటివరకు ఏ ఒక్క వాహనానికి రవాణా శాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోలేదు. ఏడేళ్లు దాటిన వాహనాలకు ప్రతి ఏడాదికి ఒకసారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రవాణా శాఖ జారీ చేస్తుంది. కాని ఆ నిబంధన పెడన పురపాలిక వాహనాలకు అమలు కావటంలేదు. ఇక బీమాను ప్రతి ఏడాది బీమా కంపెనీలకు చెల్లించాలి. ఒక వేళ ప్రమాదం జరిగితే బీమా కంపెనీ నిబంధనల ప్రకారం క్లెయిమ్ చెల్లిస్తుంది. ఇక పొల్యూషన్ సర్టిఫికెట్‌ను ప్రతి ఆర్నెల్లకు ఒకసారి తీసుకోవాల్సి ఉండగా అదీ అమలుకు నోచుకోవడం లేదు. వాహనాన్ని నడిపే వ్యక్తికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్న నిబంధన కూడా ఇక్కడ అమలు కావటం లేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రవాణా శాఖ నిబంధనలు పాటించేలా చర్యలు చేపడతామని చెప్పారు.


ప్రజారోగ్య విభాగంలోని వాహనాలు

టెట్ పరీక్షలకు 80.58 శాతం మంది హాజరు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తోన్న టెట్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని డీఈవో తాహెరాసుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1336 మందికి గానూ 1066 మంది, మధ్యాహ్నం 1336 మందికి 1087 మంది పరీక్షలు రాశారన్నారు. మొత్తం 80.58 శాతం హాజరు నమోదైందని వివరించారు.

చిన్నారులకు సదుపాయాలు కల్పించండి

పోడు(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: న్యూహరిజెన్ చిల్డ్రన్ సేఫ్ హోమ్‌లోని పిల్లలకు అన్ని సదుపాయాలు సక్రమంగా కల్పించాలని ఎస్సై ఎ.పైడిబాబు సూచించారు. పోడు గ్రామం శివారు హోమ్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సీసీ పుటేజీలను పరిశీలించారు.

ఆనందోత్సాహాలతో తాళం భజన పోటీలు

ఘంటసాల: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయిలో చిట్టూర్పులో శివాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న తాళం భజన పోటీలు ఆకట్టుకుంటున్నాయి. సోమవారం చినకళ్లేపల్లి, చోరగుడి, చటారిపాలెం, వేములమడ గ్రామాల భక్త సమాజాలు పాల్గొన్నాయి.

'పేదల ఇళ్ల పేరుతో వైకాపా దోపిడీ'

పెడన, న్యూస్‌టుడే: పేదలందరికీ ఇళ్ల పేరుతో గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు దోపిడీకి పాల్పడ్డారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ధ్వజమెత్తారు. పెడనలోని పల్లోటి 1, 2 పైడమ్మ లేఔట్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. కాలనీ వాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఈరెండు చోట్ల ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. వీధి దీపాలు వెలగటం లేదని, రహదార్లు, డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరు అందడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు కాలనీల్లో పనులు చేపట్టి దోపిడీ చేశారని కడపకు చెందిన కాంట్రాక్టర్ ఎలక్ట్రికల్ పనుల్లో నాసిరకం మెటీరియల్ వాడటంతో ఈ పరిస్థితి ఎదురైందన్నారు. మెరక పనులు, రహదార్ల నిర్మాణంలోనూ దోపిడీ జరిగిందన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అమృత్ 2.0 నిధులతో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ పర్యటనలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరక్టర్ వెంకట్రావు, బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, హౌసింగ్ డీఈ బుజ్జిబాబు, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, తెదేపా నేతలు యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయ్యూం హన్ను, రెహ్మాన్‌బేగ్, వాహబ్ ఖాన్, యర్రా రాజా, 1వ వార్డు కౌన్సిలర్ బళ్ల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలం.. నిత్యం భయం

బంటుమిల్లి, న్యూస్‌టుడే: బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏళ్ల తరబడి శిథిల భవనాలు తొలగించకపోవడంతో ప్రమాదభరితంగా మారాయి. ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంగణంలో దెబ్బతిన్న భవనాలు మూడు ఉన్నాయి. వీటిని తొలగిస్తే కళాశాలకు అదనంగా ఖాళీ స్థలంతో పాటు ఉపయోగకరంగా ఉంటుంది. గత ప్రభుత్వం హయాంలో 'నాడు-నేడు' పేరుతో చేపట్టిన పనుల నిమిత్తం పాత నాపరాళ్లు తొలగించారు. వాటి రద్దును కూడా ప్రాంగణంలో వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఆయా నిర్మాణాలను తొలగించడంతో పాటు మైదానాన్ని చదును చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కూలిపోయే దశలో భవనం


మైదానంలో వదిలేసిన నాప రాయి వ్యర్థాలు

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

★ **మురుగు నిల్వకుండా చర్యలు :** కానూరు తులసీనగర్ 4వ రోడ్డులో డ్రైనేజీలో మురుగు నిలిచిపోయిందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మురుగు నిలవకుండా చర్యలు చేపట్టారు. దీనితో మురుగు సమస్య తీరిపోయింది.

★ **విద్యుత్తు తీగల సమస్య పరిష్కారం :** కామయ్యతోపు సెంటర్లో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయని స్థానికులు కొండ్రు కోటేశ్వరరావు 'మేమున్నాం..మీకుతోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన విద్యుత్తుశాఖ ఏఈ వంశీ సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

– న్యూస్‌టుడే, కానూరు

సాయిబాబా విగ్రహాల తొలగింపు సరికాదు

హనుమాన్‌జంక్షన్: వారణాసిలో 14 చోట్ల సాయిబాబా విగ్రహాలు తొలగించడం సరికాదంటూ వీరవల్లి సాయి మందిర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మందిరం వద్ద వారు మాట్లాడుతూ సనాతన రక్షక్ దళ్ వ్యవస్థాపకులు భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఈ చర్యలకు పాల్పడ్డారని కోడెబోయిన బాబీ, రావి ఈశ్వర్, మాధవరావు, తవ్వా ఆదిలక్ష్మి, ప్రభావతి, రమాదేవి, పద్మ, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.




దత్తపీఠంలో శ్రీమీనాక్షీ దేవిగా అమ్మవారు, భక్తుల పూజలు

జగన్మాతకు నీరాజనం

పటమట, న్యూస్‌టుడే: పటమట దత్త పీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరీ ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు శ్రీమీనాక్షీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్దఎత్తున సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం విశేషార్చన, మృత్యుంజయ ఆయుష్య సహిత రుద్రాభిషేకం నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తవ్వకాలు.. తరలింపు

రాత్రి వేళ యథేచ్ఛగా రబ్బీసు క్వారీయింగ్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : మల్లవల్లిలోని ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో రబ్బీసు తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. పారిశ్రామికవాడకు కేటాయించిన భూమితో పాటు, సామాజిక అవసరాల కోసం ఉంచిన వందెకరాల్లోనూ, ప్రైవేటు భూముల్లోనూ నిర్విరామంగా రబ్బీసు తవ్వి తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తవ్వకాలు నిలిపివేయాల్సిందిగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా, కొందరు బేఖాతరు చేస్తున్నారు. చీకటి పడగానే రోజూ ఏదో ఒక మూల జేసీబీలు పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో రబ్బీసు తరలించేస్తున్నారు. ఇప్పటికే మల్లవల్లిలో గ్రామస్థులు రెండు పర్యాయాలు టిప్పర్లు, జేసీబీలను పోలీసులకు అప్పగించారు. అయినా ఈ తవ్వకాలు ఆగకపోవడం గమనార్హం. కొద్ది రోజుల కిందటే సున్నపురాయిని పోలిన ఖనిజాన్ని రాత్రి సమయాల్లో తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వ్యవహారం పెద్ద దుమారమే రేపింది.



పారిశ్రామికవాడ సమీప భూముల్లో రాత్రి ఇలా..

తాజాగా సోమవారం రాత్రి ఏపీఐఐసీ పరిధిలోని భూములతో పాటు, ఇళ్ల స్థలాల కోసం ఉంచిన స్థలంలోనూ జోరుగా తవ్వకాలు జరిపారు. ఏపీఐఐసీ అధికార్ల విజ్ఞప్తి మేరకు ఇక్కడ తవ్వకాలను నిరోధించేలా హోంగార్డులను నియమించారు. వారిని కూడా లెక్కచేయకుండా కొందరు అక్రమార్కులు తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై బాపులపాడు తహసీల్దార్ వి.నాగభూషణంను 'న్యూస్‌టుడే' సంప్రదించగా, తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులు రాగానే తక్షణం స్పందించి తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎక్కడ అనధికార తవ్వకాలు జరిగినా వెంటనే యంత్రాలు, వాహనాలు స్వాధీనం చేసుకుని, బాధ్యులపై కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసులకు సైతం స్పష్టంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. సోమవారం రాత్రి తవ్వకాలు జరుగుతున్న విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుబజారు కల సాకారం

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్

దసరా వేళ ప్రారంభించడానికి ఏర్పాట్లు

కానూరు, పోరంకి, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ తాడిగడప పురపాలక ప్రజల చిరకాల కోరిక కూటమి ప్రభుత్వంలో ఎట్టకేలకు నెరవేరుతోంది. స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఎన్నికల సమయంలో ఇచ్చిన శాశ్వత రైతు బజారు ఏర్పాటు హామీ కార్యరూపం దాల్చుతోంది. దసరా వేళ ఈనెల 9వ తేదీన ప్రారంభించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. వీవీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా బందరు కాల్వ కట్ట పక్కన ఉన్న ఇరిగేషన్ స్థలంలో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఒకేసారి ఇక్కడ 42 దుకాణాలు ఏర్పాటు చేసేలా షెడ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. విజయదశమికి ఇది అందుబాటులోకి వస్తుండడంపై అటు ప్రజలు, అటు వ్యాపారుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



కొత్తగా నిర్మించిన దుకాణాలు



ఇంజినీరింగ్ కళాశాల నడక దారిపై కూరగాయల విక్రయాలు

★ **గత ప్రభుత్వం నిర్లక్ష్యం:** వైకాపా సర్కారు గతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రైతుబజారు 2023లో మూతపడింది. 2021 కరోనా పరిస్థితుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలో రైతుబజారును ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా ఇప్పటి వరకు వినియోగదారులకు సేవలు అందించారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా రోడ్డు వేస్తుండడంతో రైతుబజారును ఖాళీ చేయించారు. గత సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కళాశాల ఫుట్‌పాత్‌పై అమ్మకాలు సాగిస్తున్నారు. కానూరు, తాడిగడప, పోరంకి ప్రాంత వాసులకు ఈ రైతు బజారు దగ్గరగా ఉండడం, ధరలు కూడా తక్కువగా ఉండడంతో వినియోగదారులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

★ **ఇబ్బందులు ఎదుర్కొని..:** ఇరిగేషన్ స్థలంలో ఏర్పాటు చేయడానికి మొదట్లో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. వాటన్నింటిపై ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు లేకుండా చేశారు. అనంతరం అధికారులు పనులు చేపట్టి కొద్ది రోజుల్లోనే పూర్తి చేశారు. రానున్న రోజుల్లో ఈ రైతు బజారును పూర్తి స్థాయి సౌకర్యాలతో ఆధునికీకరిస్తే ఎంతోమందికి ప్రయోజనం కలుగుతుంది.

పురపాలిక సమాచారం
సర్కిల్స్: నాలుగు (కానూరు, తాడిగడప, యనమలకుదురు, పోరంకి)
జనాభా: 2,00,000

42 దుకాణాల ఏర్పాటు – పి.భవానీప్రసాద్, కమిషనర్



పురపాలికలోని 2 లక్షల మంది జనాభాకు అందుబాటులో ఉండేలా రైతుబజారు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం 42 దుకాణాలకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వీటికి అద్దెను నిర్ణయించి, కూరగాయల అమ్మకందారులకు కేటాయిస్తాం. వీటిని పర్యవేక్షించడానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టరును నియమిస్తాం.

ఆనందంగా ఉంది – కె.పద్మ, పోరంకి



శాశ్వత రైతుబజారు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. తక్కువ ధరకే కూరగాయలు అందుబాటులో ఉంటాయి. గతంలో పటమట రైతుబజారుకు వెళ్లాల్సి వచ్చేది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది.

నిత్యం అందుబాటులో ఉంటాయి – పి.సుగుణ



గతంలో ఉదయం 10 గంటల వరకు మాత్రమే రైతుబజారు అందుబాటులో ఉండేది. ఇప్పుడు శాశ్వత నిర్మాణాలు చేయడంతో ఉదయం నుంచి రాత్రి వరకు దుకాణాలు అందుబాటులో ఉంటాయి. అనుకూల సమయాల్లో కూరగాయలు కొనుగోలు చేసుకోవచ్చు.

రామలింగేశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ

పెనమలూరు: యనమలకుదురు రామలింగేశ్వర స్వామికి శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున అర్చకులు ఈవో చంద్రశేఖర ఆజాద్ సోమవారం ఆలయానికి చేరుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. వీటిని రామలింగేశ్వరాలయం కార్యనిర్వహణాధికారి ఎన్.భవాని, ఏపీ ధార్మిక పరిషత్ డైరెక్టర్ నరసింహారావులకు అందజేశారు. ఆలయ అభివృద్ధిని ఆయన ప్రశంసించారు.

పంచాయతీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

రామవరప్పాడు: ఎనికేపాడు పంచాయతీ కార్యదర్శిగా మండవ సోమ విద్యాధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ప్రసాదరావు గన్నవరం మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రూరల్ తహసీల్దారును మర్యాదపూర్వకంగా కలిశారు.

చండీమాతా.. నమోస్తుతే

న్యూస్‌టుడే, బృందం: దసరా నవరాత్రి వేడుకలు పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు కొన్నిచోట్ల శ్రీమహాచండీదేవిగా, మరికొన్ని చోట్ల దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక కమిటీల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



పెనమలూరులో శ్రీమహాచండీదేవిగా...



యనమలకుదురు కనకదుర్గమ్మ ఆలయంలో..



విజయదుర్గాదేవి ఆలయంలో మహాచండీశ్వరి దేవిగా..



ఉయ్యూరు: సోమేశ్వరాలయంలో రాజేంద్రప్రసాద్ దంపతులు



ప్రొద్దుటూరు శివారు గాయత్రి విహార్‌లో..



కన్యకాపరమేశ్వరి మందిరంలో అన్నపూర్ణాదేవిగా..



తాడిగడప రామాలయంలో దుర్గాదేవిగా..



ముదునూరులో కాశీ అన్నపూర్ణదేవిగా..



వీరవల్లిమోఖాసాలో మంగళ గౌరీదేవిగా...



కొత్తపల్లిలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



పెనమలూరు: స్కందమాత అలంకరణలో..



ప్రసాదంపాడు: సాయిబాబా ఆలయంలో..



గన్నవరం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో...

ప్రాఫిట్ షూ కంపెనీ ప్రారంభం

రామవరప్పాడు, న్యూస్‌టుడే : ప్రసాదంపాడులో ప్రాఫిట్ షూ కంపెనీ 95వ షోరూమ్‌ను సోమవారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నగర శివారు ప్రాంత ప్రజలకు అందుబాటులో ప్రసాదంపాడులో షోరూమ్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రాఫిట్ షూ కంపెనీ ఎండీ బోడేపూడి కోటేశ్వరరావు, ప్రసాదంపాడు సర్పంచి సర్నాల గంగారత్నం, ఉప సర్పంచి గూడవల్లి నర్సయ్య, నాయకులు సర్నాల బాలాజీ, బొప్పన హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, చిత్రంలో గంగారత్నం, బాలాజీ, నర్సయ్య, హరికృష్ణ తదితరులు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పోరంకి, న్యూస్‌టుడే: పోరంకి సెక్షన్ పరిధిలో 33బై 11కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ ఏవీఎం ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటలు వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ హరిబాబు, గుణదల, పోరంకి ఏఈ సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. సాలిపేట రోడ్డు పెనమలూరు సెంటర్, ఏవీఎం గార్డెన్స్, సిద్ధిక్ కట్ట రోడ్డు, బందరు రోడ్డు ప్రాంతాల్లో అంతరాయం కలగనుంది.

రఫీ కుటుంబానికి మంత్రి పరామర్శ

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన ఉయ్యూరు పట్టణ తెదేపా నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహమ్మద్ రఫీ(ఎల్‌పీ) కుటుంబాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం రాత్రి పరామర్శించారు. రఫీ గృహానికి వెళ్లి ఆయన సతీమణి మాజీ కౌన్సిలరు జరీనాబేగం, కుమారుడు ఇర్ఫాన్‌కు ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఆయనతోపాటు నగర పంచాయతీ మాజీ ఛైర్మన్ అబ్దుల్ ఖుద్దూస్, మండల తెదేపా అధ్యక్షులు కుటుంబరావు పట్టణ తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు గుర్నాథరావు, చిరంజీవి, తెదేపా నాయకులు వంగవీటి శ్రీనివాసప్రసాద్, రత్నం బుజ్జి తదితరులున్నారు. ఇటీవల మృతి చెందిన గోర్ల వెంకటేశ్వరరావు కుటుంబాన్ని కూడా మంత్రి పరామర్శించారు.

పరిపాలనలో భాగస్వాములు కావాలి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ పరిపాలనలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో జోగేశ్వరరావు సూచించారు. పంచాయతీల్లో సాధారణ పరిపాలన, నిబంధనల అమలు గురించి ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు విడతలుగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఒక్కో విడతలో రెండ్రోజుల పాటు శిక్షణ ఉంటుందని, కేవలం సర్పంచులు, కార్యదర్శులే కాకుండా గ్రామ పరిపాలనలో మిగతా పాలకవర్గాన్ని భాగస్వామ్యం చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని ఎంపీడీవో తెలిపారు.

మెరుగైన సేవలందించాలి

పెనమలూరు, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు పరిపాలనా అనుభవంతో మరింత మెరుగైన పాలనను ప్రజలకు అందించొచ్చని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలంలోని వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు గ్రామ పరిపాలనపై ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు తాను కూడా ఉప సర్పంచిగానే పనిచేస్తూ రాజకీయ జీవితాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాల ఆదాయం, బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవడం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయవచ్చని చెప్పారు. పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అక్రమ లేఔట్లు, అక్రమ నిర్మాణాలను ఎంత మాత్రం అనుమతించవద్దన్నారు. వీటి వల్ల పంచాయతీలకు ఆదాయం రాకపోగా ఆర్థిక భారం ఏర్పడుతోందన్నారు. పెదపులిపాక, యనమలకుదురు, కానూరు, తాడిగడప ప్రాంతాలు వీటికి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో బండిప్రణవి, ఈవోఆర్‌డీ బొమ్మసాని శ్రీనివాసరావు, ఉప సర్పంచులు, వార్డుసభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

టెట్ పరీక్షలకు 80.58 శాతం మంది హాజరు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తోన్న టెట్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని డీఈవో తాహెరాసుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1336 మందికి గానూ 1066 మంది, మధ్యాహ్నం 1336 మందికి 1087 మంది పరీక్షలు రాశారన్నారు. మొత్తం 80.58 శాతం హాజరు నమోదైందని వివరించారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

పెనమలూరు, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు పెనమలూరు పోలీసులు చెక్ పెట్టారు. సోమవారం చోడవరం, యనమలకుదురు ఇసుక క్వారీల్లో పికెట్ ఏర్పాటు చేశారు. రెండు క్వారీల్లోనూ కొంతకాలం నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ఇటీవల ఈ వ్యవహారం శాంతిభద్రతల సమస్యగా తయారైంది. ఏకంగా పొక్లెయిన్లను నదిలోకి దింపి వందల ట్రాక్టర్లకు ఇసుక నింపి తరలిస్తుండడంతో పెద్ద దుమారం రేగింది. రెండు ప్రాంతాల్లోనూ వర్గాలుగా విడిపోయిన అక్రమ ఇసుక రవాణాదారులు కొట్లాటలకు దిగడంతో పోలీసులు రంగంలోకి దిగారు. రెండు ప్రాంతాల్లో క్వారీల వద్ద సోమవారం నుంచి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు నదిలోకి దిగకుండా రహదారులకు గుంతలు తవ్వి అడ్డుగా మొద్దులు ఏర్పాటు చేశారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్ క్వారీలను పరిశీలించి అక్రమ రవాణా అడ్డుకోవడానికి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. రెండు ప్రాంతాల్లోనూ ఇసుక మాఫియా పేర్లపై ఆయన ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. అక్రమ ఇసుక రవాణా చేస్తే షీట్లు, కేసులు నమోదు చేయడానికి కూడా యోచిస్తున్నట్లు సమాచారం.



చోడవరం క్వారీ వద్ద పికెట్ పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

తాళం భజన పోటీలు

ఘంటసాల, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయిలో చిట్టూర్పులో శివాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న తాళం భజన పోటీలు ఆకట్టుకుంటున్నాయి. సోమవారం చినకళ్లేపల్లి, చోరగుడి, చటారిపాలెం, వేములమడ గ్రామాల భక్త సమాజాలు పోటీల్లో పాల్గొన్నాయి. ఘంటసాల పాటలు పాడిన నరసింహారావును నిర్వాహక కమిటీ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, వేములపల్లి సుధీర్, దాసరి సతీష్, దాసరి సురేష్ సత్కరించారు.

'గోగినేని' చిరస్మరణీయులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పాతతరం వైద్యుల్లో ఒకరిగా గుర్తింపు పొంది, 49 ఏళ్ల హనుమాన్‌జంక్షన్‌లో వైద్య సేవలందించిన గోగినేని భాస్కరరావు చిరస్మరణీయులని పలువురు కొనియాడారు. సోమవారం ఆయన దశదిన కర్మ సందర్భంగా హనుమాన్‌జంక్షన్ కాకాని కల్యాణ మండపంలో తెదేపా మండల మాజీ ధ్యక్షుడు వీరమాచనేని సత్యప్రసాద్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, నాయకులు దుట్టా రామచంద్రరావు, చలమలశెట్టి రమేష్, అక్కినేని వనజ, గుండపనేని ఉమాప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, తదితరులు భాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పించారు.



భాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గన్నవరంలో వర్షం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి రోడ్డుపై వరద పారగా.. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తహసీల్దార్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలోకి వర్షపు నీరు చేరడంతో సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. మరోవైపు గన్నవరం గౌడపేట, బీఎన్‌పురం, కేసరపల్లి ఎస్సీ కాలనీ, దావాజీగూడెం శివారు పల్లపు ప్రాంతాలు, తెంపల్లి, అజ్జంపూడి కాలనీల్లో భారీగా వరద చేరి నివాసితులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీలు నిర్మించకపోవడం ద్వారానే ఇళ్లలోకి నీరు చేరుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరారు.



తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్లపై నీళ్లు పడకుండా అట్టల ఏర్పాటు

జూదరుల అరెస్టు

యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే: యనమలకుదురులోని ఓ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న జూదశిబిరంపై పెనమలూరు పోలీసులు దాడిచేసి రూ.29 వేల నగదు స్వాధీనం చేసుకొని 9 మంది జూదరులను అరెస్టు చేశారు. వారంతా యనమలకుదురు పరిసర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. మరీదు మురళీకృష్ణ అనే వ్యక్తి అపార్ట్‌మెంట్‌లో ప్లాటు అద్దెకు తీసుకొని జూదమాడుతున్నట్లు తెలిపారు.

అస్తవ్యస్త పనులతో రోగుల అవస్థలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: శాశ్వత భవనం పూర్తికాక, సరైన వసతి లేక బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, వైద్యులు, సిబ్బంది మూడేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయుర్వేద వైద్యశాల కోసం నిర్మించిన రెండు గదుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. రోగులు ఆరుబయటే వేచి ఉండాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో సోమవారం డిజిటల్ ల్యాబ్ భవన నిర్మాణ పనుల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లే మార్గంలో భారీ ఇనుప చువ్వలు అడ్డంగా పెట్టి, యంత్రాలతో ప్రమాదకరంగా రాడ్ బెండింగ్ పనులు చేపట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. రోగులు, సిబ్బంది రాకపోకలు సాగించే మార్గంలో ప్రమాదకర రీతిలో పనులు ఏమిటంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆసుపత్రి లోపల రాడ్ బెండింగ్ పనుల నిర్వహణ

బాక్సింగ్‌లో ప్రతిభ

ఉయ్యూరు: హైదరాబాద్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ నిర్వహించిన ప్రథమ ఓపెన్ సబ్ జూనియర్, జూనియర్స్ బాలుర, బాలికల తెలంగాణ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఉయ్యూరు బాలిక అబ్దుల్ ఆఫియా జబిన్ ప్రతిభ చూపి బంగారు పతకం సాధించింది. తెలంగాణ రాష్ట్రం హకీంపేట స్పోర్ట్స్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ ఆఫియా జబిన్ ఈ పోటీల్లో 37-40 కేజీల బరువు విభాగం బాక్సింగ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని చేజిక్కించుకుంది. కోచ్‌లు ఆనంద్‌భాస్కర్, సూర్యనారాయణ ఆమెను అభినందించారు.



బంగారు పతకంతో ఆఫియా జబిన్

కొండముచ్చు దాడి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలో కొండముచ్చుల బెడద రోజురోజుకు ఎక్కువవుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన నాగదేశి లోకేశ్ అనే వృద్ధుడు స్థానిక జోసఫ్‌తంబి ఆలయానికి వెళ్లే క్రమంలో కొండముచ్చు దాడి చేసింది. దీంతో అతని కాలుకు తీవ్ర గాయమైంది. స్పృహ కోల్పోయిన లోకేశ్‌ను స్థానిక పిన్నమనేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరీదు చిట్టెమ్మ, దొడ్ల నాగరాజుతో పాటు మరో నలుగురిపై కొండముచ్చులు దాడి చేసి గాయపర్చాయి. సత్వరమే కొండముచ్చులను పట్టించి ప్రజలకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ సిబ్బందికి సీపీఎం నాయకులు కె.రామరాజు తదితరులు వినతిపత్రం అందజేశారు.



గాయపడిన లోకేశ్ కాలు

కామయ్యతోపులో కారు బీభత్సం

ఐదుగురు యువకులకు గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: యువకులు కారుతో బీభత్సం సృష్టించారు. రహదారి పక్కన దుకాణాలు, ఫుట్‌పాత్‌ల పైకి ఎగురుతూ దూసుకువెళ్లిన కారు పల్టీలు కొట్టడంతో అందులోని ఐదుగురు యువకులు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నగరంలోని పెనుబోతుల తేజ వెంకటపవన్ విజయవాడలో ఓ కళాశాలలో చదువుతున్నాడు. ఆదివారం రాత్రి వీరు తమ స్నేహితుడి జన్మదిన వేడుకలకు వెళ్లారు. అక్కడ మద్యం తాగిన వీరు.. ఓ స్నేహితుడిని దించడానికి తమ వాహనంలో తాడిగడప బయల్దేరారు. కామయ్యతోపు వద్దకు వచ్చే సరికి కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న దుకాణాలు, ఫుట్‌పాత్‌ల పైకి దూసుకెళ్లింది. అంతటితో ఆగకుండా గాలిలోకి ఎగిరి పల్టీలు కొట్టడంతో బందరు రోడ్డుపై తిరగబడింది. కారులో ఉన్న ఐదుగురు యువకులు గాయాలపాలయ్యారు. కారు నడిపింది వెంకటపవన్‌గా గుర్తించిన పోలీసులు ఇతడితో కారులో ఉన్న కార్తికేయ, రోహిత్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పల్టీ కొట్టిన వాహనం

గుడివాడ

●గుడివాడ ●పామర్రు ●అవనిగడ్డ

విద్యుత్తు సమస్యలపై వెంటనే స్పందించండి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. సోమవారం విద్యుత్తు అధికారులతో ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కోడూరు శివారు నాయుడుపేటలో విద్యుత్తు సమస్యలపై ప్రజలు రోడ్డెక్కే వరకు తీసుకురావడంపట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఆందోళనలకు ఆస్కారం ఇవ్వకుండా సత్వరం స్పందించి ఉండాలని స్పష్టం చేశారు. ఉయ్యూరు డీఈఈ కృష్ణ నాయక్, అవనిగడ్డ, చల్లపల్లి ఏడీఈలు ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి.శివంగేశ్వరరావు, ఏఈలు ప్రసాద్, రాజు, గోపి పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఇది జవాబుదారీ ప్రభుత్వం..ప్రజాసేవే ధ్యేయం


ఎమ్మెల్యే కుమార్‌రాజాకు అర్జీలు అందిస్తున్న మహిళలు

పమిడిముక్కల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరిస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా అన్నారు. పమిడిముక్కల పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ఇటీవల వరదలకు నష్టపోయిన బాధితులకు ముఖ్యమంత్రి సారథ్యంలో రూ.కోట్లలో పరిహారం అందజేశామన్నారు. వరద బాధితులకు నియోజకవర్గంలో ఇంటికి రూ.పది వేలు చొప్పున సుమారు రూ.2.23కోట్లు అందజేశామన్నారు. పామర్రులో త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాలకు ధాన్యం తోలిన 48 గంటల్లో వారికి సొమ్ము చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నివేశన స్థలాలు, గృహనిర్మాణ రుణాలు, పింఛన్లు తదితరాలు కోరుతూ ప్రజల నుంచి 225 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో విలలిజాత్ తెలిపారు. సర్పంచి ముళ్లపూడి సునీత, తహసీల్దారు నవీన్‌కుమార్, అధికారులు, మండల తెదేపా అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ✤ అనంతరం పమిడిముక్కలలో పదేళ్ల కిందట నిర్మించి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న స్త్రీశక్తి భవనాన్ని వర్ల పరిశీలించారు. డ్వాక్రా మహిళల అభ్యర్థనపై వీరంకిలాకులో అద్దెగృహంలో నడుస్తున్న వెలుగు కార్యాలయాన్ని ఇందులోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తాగునీటి పరికరం వితరణ

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం పురిటిగడ్డలోని పీహెచ్‌సీకి దాతలు తాగునీటి పరికరాన్ని సోమవారం అందజేశారు. నాదెళ్లవారిపాలెంకు చెందిన కర్ర రాధాకృష్ణ జ్ఞాపకార్థం భార్య ప్రమీలారాణి రూ.11వేలు విలువైన తాగునీటి పరికరాన్ని అందించారు. వైద్యాధికారిణి డాక్టర్ కె.వి.పద్మావతి, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్ పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలు.. సిబ్బందికి అవస్థలు

✤ మూడున్నరేళ్లుగా నిర్మాణాలు కొనసాగుతూ..

✤ వినియోగంలోకి రాని గ్రామ సచివాలయాలు

న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం, నాగాయలంక

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని గత వైకాపా ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థ ప్రవేశపెట్టింది. యుద్ధప్రాతిపదికన గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసింది. కానీ వాటికి శాశ్వత భవనాలు సమకూర్చడంలో విఫలమైంది. మూడున్నరేళ్లుగా అసంపూర్తి నిర్మాణాలు గత వైకాపా ప్రభుత్వ తీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఒక్కొక్కటి రూ.40 లక్షలతో మూడున్నరేళ్ల కిందట అట్టహాసంగా నిర్మాణాలు ప్రారంభించారు. అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో 26 భవనాల నిర్మాణం చేపట్టగా అవనిగడ్డ మండలంలో 10కి 5, నాగాయలంక మండలంలో 16కి అయిదు మాత్రమే పూర్తిచేశారు. మిగిలినవి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి.

✤ దివిసీమ ముఖ ద్వారమైన పులిగడ్డ సచివాలయ భవనం అంపూర్తిగా దర్శనమిస్తోంది. ఇద్దరు గుత్తేదారులు అష్టకష్టాలు పడినా పూర్తి చేయలేకపోయారని గ్రామస్థులు వాపోతున్నారు. గుత్తేదారులకు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వారు చేతులెత్తేశారు. ఫ్లోరింగ్ పనులు, విద్యుదీకరణ, దర్వాజాలు, కిటికీలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

✤ అవనిగడ్డలో ఒకటి, నాలుగో, పులిగడ్డ, మోదుమూడి, అశ్వరావుపాలెం సచివాలయాలు అసంపూర్తిగా మిగలాయి.


అశ్వరావుపాలెంలో ముళ్ల పొదల మధ్య గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం భవనాలు

✤ నాగాయలంక మండలంలోని 16 సచివాలయాలకు అప్పటి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున భూమి పూజ చేసి భవనాలను అందుబాటులోకి తెస్తామని ఆయా గ్రామస్థులకు చెప్పారు. ఇంతవరకూ నాగాయలంకలో రెండు, సొర్లగొంది, తలగడదీవి, సంగగొల్లో అయిదు భవనాలు మాత్రమే సమకూరాయి.

✤ పంచాయతీ కార్యాలయాల్లో సచివాలయాలు ఏర్పాటు చేయడంతో చాలీచాలని గదుల్లో పంచాయతీ, సచివాలయాల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయించి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పంట నష్టపరిహారంపై విచారణ చేయాలి

చాగంటిపాడు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: చాగంటిపాడు పరిధిలో రైతులకు అందించిన పంట నష్టపరిహారంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని నందేటి రాజకుమార్ సోమవారం కలెక్టర్ బాలాజీకి ఫిర్యాదు చేశారు. వ్యవసాయ, రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటన చేయకుండా పంటలు నమోదు చేశారని, దీని వల్ల నష్టపోయిన కొంతమంది రైతులకు పరిహారం అందలేదని, పంట వేయని రైతులకు పరిహారం రాశారని, అర ఎకరం పంటవేసిన రైతులకు రెండు ఎకరాలకు పంట నష్టపరిహారం రాశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ✤ ధాన్యం నగదు చెల్లించకుండా రమారమి 50 మంది రైతులకు రూ.2.50 కోట్ల మేర ఎగవేసిన గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి వెంకటేశ్వరరావుపై తగు చర్యలు తీసుకోవాలని నాగాయలంక మండలం వక్కపట్లవారిపాలెం గ్రామానికి చెందిన బాధిత రైతులు పూర్ణానంద సముద్రాల, వెంకయ్య, తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పరిపాలన విధులపై అవగాహన

నాగాయలంక, న్యూస్‌టుడే: ఉప సర్పంచి, వార్డు సభ్యులకు రెండ్రోజుల పాటు శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో సీతారామ కుమార్ ప్రారంభించారు. మొదటి రోజు ఈవోపీఆర్డీ ఎం.హరినాథ్‌బాబు, వక్కపట్లవారిపాలెం సర్పంచి అంబటి శ్యామ్‌ప్రసాద్, మండల విస్తీర్ణాధికారి కె.అప్పల నరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని సాధారణ కార్యనిర్వహణ అధికారాలు, పంచాయతీ రాజ్ చట్టం తదితరాల గురించి సభ్యులకు అవగాహన కల్పించారు.

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో సోమవారం మండలంలోని సగం మంది ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు ఈఓపీఆర్డీ కిషోర్ శిక్షణ ఇచ్చారు.

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రవికాంత్ మండలంలోని ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు.

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని డీఎల్‌డీవో వి.సుజాత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచులు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు వివరించారు. ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో మండల పరిషత్తు సమావేశం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటసుమతి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్తిస్థాయిలో సమస్యలపై చర్చించడం, సుమారు 15 శాఖల అధికారులు హాజరు కావడం విశేషం. విద్యాశాఖకు సంబంధించిన సమాచారాన్ని ఎంఈవో.2 వి.శ్రీనివాసరావు వివరిస్తూ రెండో సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపించామన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల మైదానాలను విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో సుధా ప్రవీణ్, జడ్పీటీసీ సభ్యుడు వైవీ.సత్యనారాయణ, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పసుపు మొక్కకు పువ్వు



అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ఒకటో వార్డులో నివాసం ఉంటున్న తుంగల ప్రసాద్ (నాగాయలంక ఏఎస్‌ఐ) తన పెరటిలోని కుండీలో రెండు నెలల క్రితం ఒక పసుపు దుంపను నాటారు. అది పెద్దదై పువ్వు పూయడంతో ఆ పరిసర ప్రాంత ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పసుపు మొక్కలు పూలు పూయడం చూడలేదని చెపుతున్నారు. నాటిన రెండు నెలలకే ఏపుగా పెరిగి ఒక పువ్వు పూసినట్లు ప్రసాద్ కుటుంబ సభ్యులు తెలిపారు. మొక్కకు నీరు పోయడం తప్ప ఎటువంటి ఎరువులు వేయలేదని చెప్పారు. అయితే పసుపు రైతులు మాత్రం చాలా అరుదుగా పూలు పూస్తాయని, ఆ మొక్కకు దుంపలు రావని చెబుతున్నారు.

రూ.లక్ష ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థులతో ట్రస్ట్ సిబ్బంది

చల్లపల్లి, న్యూస్‌టుడే: ప్రతిభ గల విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కాకినాడ బీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ భారతలక్ష్మి అన్నారు. ఎం.ఎ.ఖాదర్‌ఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లిం షాదీఖానాలో ప్రతిభావంతులైన 15మంది విద్యార్థులకు రూ.లక్షతో ఉపకార వేతనాలను సోమవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు ముజీబాబాను, నసీరుద్దీన్, మునీర్‌ఖాన్, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీం ఘోరి, ఉపాధ్యాయులు కస్తూరి సుభాషిణి, మహమ్మద్ ఖాజా, ఎండీ అస్లాం బాషా పాల్గొన్నారు.

తెదేపా నియోజకవర్గ బాధ్యుడ్ని నియమించండి

మోపిదేవి, న్యూస్‌టుడే: తెదేపా అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌ఛార్జిని నియమించాలని ఆ పార్టీ మండల ప్రజాప్రతినిధులు కోరారు. కూటమి విజయం తర్వాత తొలిసారిగా తెదేపా మండల కార్యకర్తల సమావేశం సోమవారం మోపిదేవిలో మండల అధ్యక్షుడు నడకుదిటి జనార్దనరావు అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యుడు చందన రంగారావు మాట్లాడుతూ కొత్తపాలెంలో జనసేన పార్టీ వల్ల తొలనొప్పులు వస్తున్నాయని నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెలలో సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. పట్టభద్రుల ఓటర్ల చేర్పులకు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కూటమిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, రావి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు(బుల్కీ), సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కనపర్తిని ఘనంగా సత్కరించారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నూతన మద్యం దుకాణాలకు వేలం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన 2024-25 నూతన మద్యం విధానం కింద అవనిగడ్డ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్లో 4 మండలాల పరిధిలో మొత్తం 11 దుకాణాలకు వేలం నిర్వహిస్తున్నారు. ఈనెల 11న లాటరీ తీసి దుకాణదారులను ఎంపిక చేయనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నారు.

ఆర్టీసీ ఛైర్మన్‌కు సత్కారం


కొనకళ్లను అభినందిస్తున్న వెంకటేశ్వరరావు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల ఆర్టీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొనకళ్ల నారాయణరావును ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు సోమవారం సత్కరించారు. బీసీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, సూరపనేని గోపీచంద్, రామదేని వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో తాళం భజన పోటీలు


ప్రదర్శనలో చోరగుడి భక్త సమాజం

ఘంటసాల, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయిలో చిట్టూర్పులో శివాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న తాళం భజన పోటీలు ఆకట్టుకుంటున్నాయి. సోమవారం చినకళ్లేపల్లి, చోరగుడి, చటారిపాలెం, వేములమడ గ్రామాల భక్త సమాజాలు పోటీల్లో పాల్గొన్నాయి. ఘంటసాల పాటలు పాడిన నరసింహారావును నిర్వాహక కమిటీ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, వేములపల్లి సుధీర్, దాసరి సతీష్, దాసరి సురేష్ సత్కరించారు.

బాధిత శిశువుకు ఆర్థిక సాయం


తల్లికి సహాయం అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మగ శిశువు(18 రోజులు) హ్యాడ్రోగంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం అతని తల్లికి రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రతినిధులు రూ. 53 వేల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. దీనిపై రోటరీ అధ్యక్షుడు టీఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ కోడూరు మండలం బడేవారిపాలెంకు చెందిన శిశువు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రోటరీ క్లబ్ సభ్యులు ఈ సహాయం అందజేశారు. క్లబ్ కార్యదర్శి జి.కిరణ్ బాబు, ఆర్.శ్రీనివాసరాజు, టి.సంజీవరావు, ఆర్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మహిళలు చట్టాల గురించి తెలుసుకొని చైతన్యవంతంగా మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'విధాన్ సె సమధాన్' పేరుతో చట్టాలు, సంక్షేమ పథకాలపై సోమవారం మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. గృహహింస చట్టం, మనోవర్తి, వరకట్నం, సంక్షేమ పథకాలు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలు రూపొందించిందన్నారు. మండల లీగల సర్వీస్ కమిటీ ఛైర్మన్, మొవ్వ జడ్జి పి.రాజన్ ఉదయ్‌ప్రకాష్ మాట్లాడుతూ మహిళలు చట్టాలను తెలుసుకొని, ధైర్యంగా గౌరవమైన జీవితం గడపాలని సూచించారు. రిసోర్స్ సభ్యులు గొరిపర్తి శ్రీనివాసరావు, సరస్వతి, కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, సూపరిండెంట్ పి.వెంకటశివయ్య, న్యాయవాదులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.వి.రామకృష్ణయ్య, పక్కన మొవ్వ జడ్జి రాజన్ ఉదయ్‌ప్రకాష్, న్యాయవాదులు

ఎలకుర్రు(పామర్రుగ్రామీణం), న్యూస్‌టుడే: చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, మచిలీపట్నం సీనియర్ సివిల్‌జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. సోమవారం ఎలకుర్రు కాశీనాధుని దుర్గాంబ బుచ్చయ్య మానసిక దివ్యాంగుల ట్రస్టులో మానసిక ఆరోగ్య చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల గురించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని కమిటీ ఇటీవల సదస్సులు నిర్వహించి పలు విషయాలను ప్రభుత్వానికి సూచనలు చేసిందన్నారు. ట్రస్టీ కాశీనాధుని నాగేశ్వరరావు అధ్యక్షతవహించి మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు శాశ్వత సదరన్ సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా జీవో విడుదల చేయించాలని కోరారు. న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు అజ్మితున్నీసా పాల్గొన్నారు.

బంకులో కల్తీ పెట్రోల్ విక్రయాలు


నీళ్లతో కలిసిన ఇంధనం చూపిస్తున్న యువకులు

మోపిదేవి,న్యూస్‌టుడే: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌లో కల్తీ పెట్రోలు కొట్టారని వినియోగదారులు బంకు యాజమాన్యాన్ని నిలదీశారు. బండికోళ్లంక గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బంకులో పెట్రోలు కొట్టించుకొని వెళ్లారు. తీరా మార్గమధ్యలో వాహనం ఆగిపోయింది. రన్నింగ్‌లో ఉండగా ఆగిపోయి, స్టార్ట్ కావడం లేదని మెకానిక్‌కు అప్పగించి మరో బండిపై వెళ్లారు. మెకానిక్ బండిలోని పెట్రోల్‌ను సీసాలోకి తీసి చూడగా అందులో నీరు ఉన్నట్లు నిర్ధారించి సంబంధిత యువకులకు చెప్పారు. దీంతో వారు బంకు వద్దకు వచ్చి బాటిల్ చూపించి నిలదీశారు.

సకలేశ్వరసామికి వెండి ఆభరణాల సమర్పణ

రొయ్యూరు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : రొయ్యూరు గ్రామంలోని గంగా పార్వతీసమేత సకలేశ్వరస్వామి ఆలయానికి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ దంపతులు వెండి ఆభరణాలను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చేతుల మీదుగా ఆలయ ఈవోకు సోమవారం అందజేశారు. తెదేపా నాయకులు ఉప్పులూరి గోపాలకృష్ణ, లుక్కా రేణుకారావు తదితరులు పాల్గొన్నారు.


ఆభరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా, దాతలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుగుణకుమారి

ఘంటసాల,న్యూస్‌టుడే: ఘంటసాల మండల పరిషత్తు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుగుణకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఎంపీడీవో డి.సుబ్బారావు, ఈవోలు అర్జునరావు, సిబ్బంది సత్కరించారు.


సుగుణకుమారిని సత్కరిస్తున్న ఎంపీడీవో సుబ్బారావు, ఈవోలు

ఎంపీడీవో సుధాప్రవీణ్‌కు సన్మానం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు మండల పరిషత్తు ఎంపీడీవోగా విధులలో చేరిన సుధా ప్రవీణ్‌ను కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సోమవారం ఆయనను శాలువాతో సత్కరించారు. తెదేపా నాయకులు బండే శ్రీనివాసరావు, జనసేన నాయకులు చంద్రరావు, శేషగిరిరావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించండి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు ఎస్సై అర్జునరాజును కోరారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మండలంలో గంజాయిని పూర్తిగా అరికట్టాలని, యువకులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పించాలని కోరారు.

9న మహాధర్నా జయప్రదం చేయాలి

పామర్రు,న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నా జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెగ్గెం ప్రసాదరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కొరముక్కువానిపురం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహంవద్ద పార్టీ నాయకులతో కలిసి మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. పామర్రు నియోజకవర్గ అధ్యక్షుడు దాసరి భానుకుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసులు అరెస్టుచేసి వారి నుంచి రూ.4లక్షలకు పైగా విలువైన 50 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం. . సోమవారం అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రహదారిలో సీఐ కరుణాకర్, ఎస్సైలు యయాతిరాజు, సాయికిశోర్ రెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రాపురానికి చెందిన బచ్చు సతీశ్, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన ఆరెంపుల ధర్మరాజు పోలీసులను చూసి కంగారుపడి పారిపోయేందుకు యత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఆ సమయంలో హత్యకూ వెనకాడరు..

నిందితులిద్దరూ దోపిడీకి పాల్పడే సమయంలో అడ్డొచ్చిన వారిపై అతి కిరాతకంగా వ్యవహరించి చితకబాదడమే గాక హత్య చేసేందుకూ వెనుకాడరని డీఎస్పీ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వీరు 15 దోపిడీ కేసులతోపాటు, ఒకరిని హత్య చేసిన ఘటనలో వీరిద్దరు నిందితులు. ఏలూరు జిల్లా చాట్రాయిలో దోపిడీ సమయంలో అడ్డొచ్చిన ఒకరిని హత్య చేసిన ఘటనలో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. అయినా వీరు దోపిడీలను ఆపలేదు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడతారని డీఎస్పీ వివరించారు. ఈ ఏడాది సెప్టెంబరు 10న అర్ధరాత్రి అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీలో రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న తుమ్మలపల్లి సత్యనారాయణపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచి అతని భార్య కళావతి మెడలోని 18గ్రాముల బంగారం గొలుసును లాక్కెళ్లారు. ఫిబ్రవరి 15 రాత్రి దమ్మపేట మండలం మందలపల్లిలో దాబా హోటల్‌లో నిద్రిస్తున్న వృద్ధురాలు మందలపు సత్తెమ్మపై దాడిచేసి ఆమె మెడలోని బంగారం నానుతాడును లాక్కెళ్లారు. అదే నెలలో విశ్రాంత ఉపాధ్యాయుడు అంజయ్య దమ్మపేట బ్యాంకు నుంచి రూ.40వేలు తీసుకెళుతుండటాన్ని గమనించి అతనిపై దాడిచేసి దోపిడీ చేశారు. వీరిపై అశ్వారావుపేట పోలీసు స్టేషన్‌లో ఒకటి, దమ్మపేటలో మూడు, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో రెండు, వేంసూరులో రెండు, ఆంధ్రాలోని ఏలూరు జిల్లా చాట్రాయిలో మూడు, అవనిగడ్డ, రేపల్లె, విస్సన్నపేట, నూజివీడులో కేసులున్నాయి. నిందితులను కొత్తగూడెం కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారు.

తలచిన ధన్యం.. కొలిచిన పుణ్యం

ఇంద్రకీలాద్రిపై భక్తుల ఆర్జిత సేవలు



రాముడు కంటే.. కృష్ణుడు కంటే.. ప్రపంచంలో సకల దేవతల కంటే గొప్పవారు కనకదుర్గాదేవి. అందరికంటే గొప్పవారు.. లోక మాత.. జగన్మాత.. ఆమెకు మించిన భగవత్ శక్తి మరొకటి లేదు. ఏ దేవుడి శక్తినైనా సందేహించవచ్చు కానీ.. జగన్మాత శక్తి మాత్రం అనంతమైనది. ఆమె ముందు కృష్ణ శక్తి కూడా పని చేయదు... అంతటి శక్తిమంతురాలైన కనకదుర్గమ్మను అర్చించాలని ప్రతి భక్తుడూ కోరుకుంటాడు. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిత్యం ఇంద్రకీలాద్రికి తరలివస్తుంటారు. అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు తమ శక్తికొద్దీ ఆర్జిత సేవల్లో పాల్గొంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి వేదవేదాంత వనవాసిని అయిన జగన్మాతకు నిత్యం త్రికాలార్చనలు, ఆర్జిత సేవలను ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. సాధారణ రోజుల్లో ఆర్జిత సేవలు సుప్రభాత సేవ, ఖడ్గమాలార్చన, వస్త్రాలంకృత సేవ, శాంతి కల్యాణం, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, రాహుకేతు పూజ, లక్షకుంకుమార్చన, చండీహోమం, శ్రీచక్రనవావరణార్చన, రుద్రాభిషేకం పూజలకు భక్తులు టిక్కెట్ రుసుము చెల్లించి చేయించుకుంటారు. దసరా వేడుకల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్జిత సేవల్లో భాగస్వామ్యాన్ని కుదించారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు మాత్రం భక్తులతో సంబంధం లేకుండా ఆర్జిత సేవలను అర్చకులు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుంకుమార్చన, చండీహోమం, శ్రీచక్ర నవావరణార్చన, ఖడ్గమాలార్చన పూజలకు మాత్రమే ఉభయ దాతలను అనుమతిస్తున్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

అత్యంత ప్రీతిపాత్రం కుంకుమార్చన

జగన్మాత దుర్గమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైనది కుంకుమార్చన. శ్రీచక్ర సహితంగా ఏర్పాటు చేసిన అమ్మవారికి ఉభయదాతల గోత్ర నామాలతో పదిమంది అర్చకులు లలితా సహస్రనామాలతో కుంకుమార్చన చేయిస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 10 నుంచి 12 గంటల వరకు కుంకుమార్చనను ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహామండపం 6వ అంతస్తులో నిర్వహిస్తారు. ఇద్దరు పాల్గొనవచ్చు. ఈ సేవ టిక్కెట్ రుసుం రూ.3వేలుగా నిర్ణయించారు. మూలా నక్షత్రం రోజు రూ.5 వేలు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

విశిష్టత
ఈ సేవతో మహిళలకు సౌభాగ్యం సిద్ధిస్తుందని విశ్వాసం.






విశిష్టత
ఈ అర్చన ద్వారా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం

శోభాయమానంగా ఖడ్గమాలార్చన

దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే ఖడ్గమాలార్చనకు ప్రత్యేకత ఉంది. మూలవిరాట్‌కు అభిముఖంగా కూర్చుని చేసే ఖడ్గమాలార్చన దసరా ఉత్సవాల్లో మాత్రం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తుకు మార్చారు. సాధారణ రోజుల్లో ఖడ్గమాలార్చన టిక్కెటుల పరిమితం కావడంతో భక్తులు నెల రోజులు వేచి ఉండాల్సి వస్తుంది. ప్రస్తుతం మల్లికార్జున మహామండపంలో ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య ఈ సేవ భక్తులకు లభిస్తుంది. టిక్కెట్ రుసుం రూ.5,116గా నిర్ణయించారు.

ఆదిశంకరులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి..





విశిష్టత
తొమ్మిది ఆవరణలలో దేవతలు కొలువుతీరిన శ్రీచక్రాన్ని పూజించడంతో అష్టైశ్వర్యాలు, సమస్త శుభాలు కలుగుతాయన్నది భక్తుల విశ్వాసం.

దుర్గమ్మ సన్నిదిలో ఆది శంకరాచార్యలు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి నిత్యార్చన జరుగుతుంది. దసరా ఉత్సవాల్లో మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో శ్రీచక్రనవావరణార్చన సేవను ఏర్పాటు చేశారు. సృష్టి, స్థితి, లయకారిణి అయిన త్రిశక్తి స్వరూపిణికి మహిమాన్వితమైన శ్రీచక్రంతో అర్చన చేస్తారు. దసరా ఉత్సవాల్లో ఈ సేవ టిక్కెట్ రుసుం రూ.3వేలుగా నిర్ణయించారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు భక్తులకు ఈ సేవ అందుబాటులో ఉంటుంది. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్లో అమ్మవారి దర్శనాన్ని దేవస్థానం సిబ్బంది చేయించి ప్రసాదాలు అందజేస్తారు.



విశిష్టత
సర్వ బాధల నుంచి విముక్తిని చండీమాత ప్రసాదిస్తుందని నమ్మకం. లోక కల్యాణం కోసం ఈ హోమం నిర్వహిస్తారు.

లోక కల్యాణానికి చండీహోమం

దుర్గామల్లేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిత్యం చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. దసరా ఉత్సవాల్లో కుంకుమార్చన తరువాత ఉభయదాతలు అత్యంత ఇష్టపడే ఆర్జిత సేవ చండీహోమం. సప్తశతి శ్లోక మంత్రాలతో ఈ హోమాన్ని రుత్విక్కులు నిర్వహిస్తారు. లోక కల్యాణం కోసం నిత్యం జరిగే విధంగా దీనిని దేవస్థానం ఏర్పాటు చేసింది. దసరా ఉత్సవాల్లో చండీహోమం టిక్కెట్ రుసుము రూ.4 వేలుగా నిర్ణయించారు. ఇంద్రకీలాద్రిపై యాగశాలలో ఉభయ దాతల సమక్షంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు జరుపుతారు.

నిత్యం త్రికాలార్చనలు

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిత్యం త్రికాలార్చనలను వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు నిర్వహిస్తారు. సుప్రభాత సేవ అనంతరం గణపతి పూజతో నిత్యం ప్రాతఃకాలార్చన చేస్తారు. శ్రీసూక్త విధాన సహితంగా షోడశోపచార పూజ నిర్వహిస్తారు. శ్రీలలిత సహస్రనామాలతో లోకాలు ఏలే తల్లిని అర్చిస్తారు. బాలభోగంగా దధ్యోజనాన్ని నివేదిస్తారు. ప్రాతఃకాలార్చన అనంతరం ఉదయం 5 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

పంచహారతులతో సాయంకాలార్చన



అమ్మవారికి సాయంకాలం 5.30 గంటలకు శ్రీసూక్త విధానంతో షోడశోపచార పూజలు చేసి, సంకల్పం చేస్తారు. యాలకులు, కిస్మిస్, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో కూడిన క్షీరాన్నాన్ని అమ్మవారికి నివేదిస్తారు. అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఓంకార, నాగ, కుంభ, పంచ, నక్షత్ర హారతులను సమర్పిస్తారు. పంచహారతులతో పాటు సింహ హారతిని కూడా ఇచ్చి వేదస్వస్తి నిర్వహిస్తారు. హారతుల సమయంలో అన్ని దర్శనాలను నిలిపివేస్తారు.

మధ్యాహ్న కాలార్చనలో మహానైవేద్యం

దుర్గగుడి ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి అష్టోత్తర, శతనామార్చన చేసి నైవేద్యాన్ని సమర్పిస్తారు. పరివారాలకు సంప్రదాయ బద్ధంగా దేవస్థానం వంటశాల నుంచి తయారు చేసిన గంగాళాలతో ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల్లోని దేవతామూర్తుల ఎదుట నివేదిస్తారు. భక్ష్య, దోష్య, లేహ్య, సూప శాకదాది సహితంగా సమర్పించే నైవేద్యాన్ని మహానైవేద్యంగా చెబుతారు.

ఐదో రోజు దసరా ఆదాయం రూ.48.31 లక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో భాగంగా ఐదో రోజు సోమవారం వివిధ సేవలు, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.48.31 లక్షల ఆదాయం వచ్చింది. రూ.500, రూ.300, రూ.100 దర్శనం టిక్కెట్ల రూ.19.41లక్షలు, రూ.5.20లక్షలు, రూ.3.81 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదాల విక్రయంతో రూ.16.25 లక్షలు, తలనీలాల టోకెన్ల ద్వారా రూ.93,600 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో.. ధర్మ ప్రచార యజ్ఞం

2003లో చంద్రబాబు సూచనలతోనే ఆరంభం ● రెండు దశాబ్దాలుగా 'శ్రీకనకదుర్గప్రభ' వెలుగు



శ్రీకనకదుర్గప్రభ పత్రిక

ఈనాడు, అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కేంద్రంగా గత రెండు దశాబ్దాలుగా ధర్మ ప్రచార యజ్ఞం కొనసాగుతోంది. దుర్గమ్మ సన్నిధి నుంచి ధర్మ ప్రచారం చేయాలనే ఉద్దేశంతో 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో శ్రీకనకదుర్గప్రభ మాసపత్రిక ఆరంభమైంది. భవిష్యత్తు తరాలకు పురాణాలు, ఇతిహాసాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ప్రధాన ఉద్దేశంతోనే దుర్గమ్మకు సొంత పత్రికను ప్రారంభించారు. కనకదుర్గమ్మ వైభవం, మల్లేశ్వరస్వామి మహిమలు, రామాయణం, భాగవతం, భారతాల సారాంశాలను నేటి తరానికి అందిస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2003లో అప్పటి దేవాదాయశాఖ మంత్రి, ఉన్నతాధికారులు, ఆలయ కార్య నిర్వహణ అధికారితో సమీక్ష సమావేశం నిర్వహించి.. విజయవాడ దుర్గమ్మ సన్నిధి నుంచి ధర్మ ప్రచార మాస పత్రిక ప్రారంభించాలని నిర్ణయించారు. 2003 ఉగాది నుంచి పత్రికను ఆరంభించారు. పురాణ, ఇతిహాసాలతోపాటు ప్రతినెలలో పండగలు, వ్రతాలు, పూజల వివరాలతో పాటు అనేక విషయాలను భక్తులకు తెలియజేస్తోంది. గత 21 ఏళ్లుగా శ్రీకనకదుర్గప్రభ మాసపత్రిక ద్వారా దుర్గగుడి కేంద్రంగా ధర్మ ప్రచారం నిర్విరామంగా కొనసాగుతోంది.

అత్యంత నాణ్యతగా లడ్డూ ప్రసాదం



లడ్డూ పోటులో ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : అత్యంత నాణ్యతగా దుర్గగుడి లడ్డూ ప్రసాదం తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సృజన ఆలయ అధికారులకు సూచించారు. మల్లికార్జునపేటలోని ప్రసాదాల తయారీ కేంద్రం(లడ్డూ పోటు)ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డూ, పులిహోర తయారీకి వినియోగించే దినుసులను పరిశీలించారు. ప్రసాదాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. మూలా నక్షత్రం రోజుకు రెండున్నర లక్షల లడ్డూలు సిద్ధం చేయాలన్నారు. సరకుల నాణ్యత పరీక్షించేందుకు నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా సరకులను తిప్పి పంపి, నాణ్యమైనవి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కనకదుర్గానగర్‌తోపాటు భవానీ ఘాట్ వద్ద కూడా ప్రసాదాలు విక్రయిస్తారని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మూలా నక్షత్రం రోజు 2.50 లక్షల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, దర్శనం, ప్రసాదాలు, అన్నప్రసాద పంపిణీ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, ఏఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్ హేమదుర్గ పాల్గొన్నారు.

నేటి అలంకారం

8-10-2024, మంగళవారం

శ్రీ మహాలక్ష్మీ దేవి



సరసిజనిలయే సరోజహస్తే
ధవళతరాంశుక గంధమాల్యశోభే
భగవతి హరివల్లభే మనోజ్ఞే
త్రిభువన భూతికరి ప్రసీదమహ్యామ్॥

సిరిసంపదలు, సౌభాగ్యం, సంతానం, ధైర్యసాహసాలు, విజయానికి అధిష్ఠాన దేవత మహాలక్ష్మి. సకల లోకాలకు ఐశ్వర్య ప్రదాయిని. ఇరువైపులా గజరాజులు సేవిస్తుండగా, రెండు చేతులతో కమలాలు ధరించి, అభయ, వరదముద్రలతో క్షీరాబ్ధి పుత్రికయై ఈ తల్లి భక్తులకు దర్శనమిస్తారు. డోలాసురుడనే రాక్షసుడిని సంహరించి, లోకాలకు శాంతి ప్రసాదించింది. త్రిపురాత్రయంలో ఈమె మధ్యశక్తి. 'యా దేవీ సర్వ భూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా' - సకల జీవుల్లో లక్ష్మీరూపంలో ఈ తల్లి కొలువై ఉంటుందని చండీసప్తశతి చెబుతోంది. రుగ్వేదం పదో మండలంలోని శ్రీసూక్తం ఈ తల్లి వైభవాన్ని కీర్తిస్తుంది. అగ్ని, మత్స్య పురాణాలు ఈమె ఆకృతి, శిల్పనిర్మాణ నియమాలు వెల్లడిస్తాయి. అష్ట లక్ష్ములకు ఈమె అధిష్ఠాత్రి. ఈ తల్లి ఉపాసన ద్వారా లౌకిక సంపదలతో పాటు అలౌకికమైన మోక్ష సంపద కూడా లభిస్తుంది. ఈమె శ్రీప్రద ఫలదాయిని. శ్రీసూక్త విధానంగా ఎర్రని పుష్పాలతో, లక్ష్మీ అష్టోత్తరంతో ఈమెను అర్చించాలి. అమ్మకు ప్రీతిగా సువాసినీ పూజ చేయాలి. లక్ష్మీస్తోత్రాలు పఠించాలి. ఓం శ్రీం హ్రీం క్లీం మహాలక్ష్మై స్వాహా అనే మంత్రాన్ని జపించాలి.

బందరులో 'కోల్‌కతా' ఆచారం

ప్రత్యేకత చాటుతున్న శక్తి పటాల ఊరేగింపు



శక్తిపటాల ఊరేగింపులో భక్తులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మచిలీపట్నం దసరా శక్తిపటాల ఊరేగింపునకు పెట్టింది పేరు. కోల్‌కతాలో మాత్రమే కనిపించే ఈ ఆచారాన్ని 1879 సంవత్సరంలో నగరానికి చెందిన మాజీ సైనికుడు దాదా ఇక్కడ పరిచయం చేశారు. తొలుత ఆయన కాళికామాత చిత్రపటాన్ని ఈడేపల్లిలో ప్రతిష్ఠించి పూజలు చేయడంతోపాటు శరన్నవరాత్రి పర్వ దినాల్లో శక్తిపటాల ప్రదర్శన మొదలుపెట్టారు. అప్పటి నుంచి ఏటా ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.


ఎలా నిర్వహిస్తారంటే..



శక్తిపటాలు

మనిషికి శక్తి వేషం వేసి వెదురు బద్దలతో చేసిన దుర్గామాత శక్తి పటానికి కాగితాలు అంటించి వీపునకు కడతారు. ఆ వ్యక్తి పురవీధులలో ఊరేగుతుండగా డప్పు మోతలతో నృత్యం చేస్తూ పలువురు భక్తులు అనుసరిస్తుంటారు. శక్తిపటం కట్టుకున్న వ్యక్తిని దుర్గామాత ఆవహిస్తుందని భక్తుల నమ్మకం. నల్లని దుస్తులతో ఒక చేతిలో చురకత్తి, రెండో చేతిలో 50 కిలోల బరువున ఆరడగుల శక్తిపటాన్ని భుజానకెత్తుకుని నిర్వహించే ప్రదర్శన నేత్రపర్వంగా సాగుతుంది. పటాన్ని ఎత్తుకునే వ్యక్తి తెల్లవారుజామున రుద్రభూమిలో పూజలు చేసి ఉపవాస దీక్ష స్వీకరిస్తారు.

ముఖానికి కరాళం..



ముఖానికి కాళికా మాత ముఖచిత్రాన్ని కరాళంగా ధరిస్తారు. దీని వల్ల శక్తిపటాన్ని ఎత్తుకునే వ్యక్తికి సరిగా గాలి అందదు. అందుకే పక్కన కొంత మంది విసనకర్రలతో విసురుతూ సహాయ సహకారాలు అందిస్తారు. భక్తులు వృత్తి రీత్యా ఎక్కడున్నా సరే పండగకు పట్టణానికి వచ్చి శక్తిపటాలతో మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఇలా చేస్తే వారి కోర్కెలు తీరతాయని విశ్వాసం. విజయదశమి రోజు నాటి రాత్రి కోనేరు సెంటర్‌లో నిర్వహించే భారీ ప్రదర్శనలో ఉత్సవాలకు ముగింపు పలుకుతారు.

కేశఖండనకు 10వేల టిక్కెట్ల విక్రయాలు



కేశఖండన శాలలో మొక్కు చెల్లించుకుంటున్న భక్తురాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మొక్కుల చెల్లింపు నిమిత్తం కృష్ణవేణి, భవాని, పున్నమీ ఘాట్లలో కేశఖండన శాలలు ఏర్పాటు చేశారు. కేశఖండన విధుల నిమిత్తం కనకదుర్గమ్మ ఆలయంతో పాటు రాష్ట్రంలోని ఇతర దేవాలయాలు, పత్రికా ప్రకటనల ద్వారా సుమారు 500 మందిని ఏర్పాటు చేశారు. మూడు కేశఖండన శాలలను ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క కృష్ణవేణిఘాట్ వద్దే విధుల నిమిత్తం సుమారు 270 మందిని కేటాయించడం జరిగింది. విధుల నిమిత్తం వచ్చిన వారికి కేశఖండనశాల వద్దే అల్పాహారం, మధ్యాహ్నం, భోజన వసతులు సమకూర్చారు. విధుల నిమిత్తం వచ్చిన వారికి టెకెన్‌కు రూ.40, పత్రికా ప్రకటన ద్వారా వచ్చిన వారికి టోకెన్ రూ.25లు చెల్లిస్తున్నారు. ఉత్సవాలు మొదలైన 3వ తేదీ నుంచి సోమవారం వరకు మూడు కేశఖండనశాలల్లోనూ కేశఖండన నిమిత్తం సుమారు 10 వేల టోకెన్లు విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. మూలా నక్షత్రం ముగిసిన అనంతరం ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భవానీ దీక్షాధారుల తాకిడి మొదలవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎంత పెద్ద బ్రాస్‌లెట్టో..

విలువ.. రూ. కోటికి పైమాటే



ఈయన పేరు రవి. చిత్తూరు జిల్లా నుంచి దసరా సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. 1.300 కిలోల బంగారంతో చేసిన బ్రాస్‌లెట్ చేతికి అలంకరించుకున్నారు. దీని విలువ సుమారు రూ. కోటి పైమాటేనని ఆయన చెబుతున్నారు. ఈ బ్రాస్‌లెట్‌ను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

- ఈనాడు, అమరావతి

శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం సారె సమర్పణ



పట్టువస్త్రాలు, సారె తీసుకువస్తున్న శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం ఈవో చంద్రశేఖర్ అజాద్, ప్రతినిధుల బృందం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా మహోత్సవాలను పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై మహాచండీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మకు శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం తరపున ఈవో చంద్రశేఖర్ అజాద్, ప్రతినిధుల బృందం పట్టువస్త్రాలు, సారెను సోమవారం సమర్పించారు. సారెను దేవస్థానం డిప్యూటీ ఈవో రత్నంరాజు, ఫెస్టివల్ ఆఫీసర్ మూర్తి స్వీకరించి అర్చకులకు అందజేశారు.

సౌకర్యాలు సరే.. పారిశుద్ధ్యం సంగతేంటి?



చెల్లాచెదురుగా మంచినీటి ప్యాకెట్లు



అదే ప్రదేశంలో కవర్లలో చుట్టి పడేసిన ప్లేట్లు

కృష్ణలంక, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తుల దాహార్తి తీర్చేందుకు కృష్ణవేణిఘాట్ వద్ద నగర పాలక సంస్థ మంచి నీటి ప్యాకెట్ల స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచే వీటిని నిర్దేశిత పాయింట్లకు తరలిస్తున్నారు. లోడింగ్.. అన్‌లోడింగ్ తదితర పనుల నిమిత్తం పెద్ద మొత్తంలో ఇక్కడ సిబ్బందిని కేటాయించారు. సిబ్బంది టిఫిన్లు, భోజనాలు ముగించుకుని తిన్న ప్లేట్లను ఇక్కడే వేస్తుండడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తింది. భారీగా మంచినీటి ప్యాకెట్లను ఇక్కడే బస్తాల్లో నిల్వ ఉంచడం..ఇక్కడి వారు తాగేందుకు అవసరమైన సందర్భంలో బస్తాల నుంచి ప్యాకెట్లను తీసుకుని నిర్లక్ష్యంగా వదిలివేయడం తదితర కారణాలుగా ప్యాకెట్లన్నీ చెల్లాచెదురై వృథా అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పేరుకే ఉచితం.. వసూళ్లు మామూలే..



ఉచితమంటూ ఏర్పాటు చేసిన బ్యానర్



నగదు మొత్తాన్ని తీసుకుంటున్న సిబ్బంది

కృష్ణలంక, న్యూస్‌టుడే: దసరా వేడుకలను పురస్కరించుకుని దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఆయా పాయింట్లలో ఉచిత పాదరక్షలు, లగేజీని భద్రపరిచే కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడి సిబ్బంది ఉచితం మాటున వసూళ్లకు పాల్పడుతుండడం భక్తులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. కృష్ణవేణిఘాట్ పరిసరాల్లో నగర పాలక సంస్థ ఉచిత పాదరక్షలు, లగేజీని భద్రపరిచే కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సామగ్రిని ఉంచే నిమిత్తం వచ్చే వారికి టోకెన్లు అందిస్తున్న అక్కడి సిబ్బంది తిరిగెళ్లే క్రమంలో వారి నుంచి బ్యాగుకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. సేవలు ఉచితమని ప్రశ్నించిన వారిని ఇక్కడ ఖాళీ లేదంటూ పంపించి వేస్తున్నట్లు భక్తులు చెబుతున్నారు. పర్యవేక్షణ లోపం కారణంగానే వసూళ్ల పర్వం కొనసాగుతున్నట్లు చెబుతున్న భక్తులు మిగిలిన రోజుల్లోనైనా పటిష్ఠంగా వ్యవహరించి సక్రమంగా సేవలందించేలా చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

తప్పని తిప్పలు..!



బస్సు దిగి రాలేక



చంటి బిడ్డలను బస్సు ఎక్కిస్తూ..

దసరా సందర్భంగా దుర్గగుడి దేవస్థానం కొండపైకి తిప్పుతున్న ఉచిత బస్సు సౌకర్యం సరిపోక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఉచిత బస్సు రాగానే వందలాది మంది భక్తులు ఒక్కసారిగా బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్నారు. దీంతో చంటి పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో రద్దీ పెరుగుతుందని, మరిన్ని బస్సులు ఏర్పాటుచేస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు.

- ఈనాడు, అమరావతి



మూడు క్యూలైన్లలోనూ భక్తులను ముందుకు లాగుతున్న పోలీసు, భద్రతా సిబ్బంది



అమ్మవారి ముందు నిలబడి కళ్లు మూసుకుని ప్రార్థిస్తున్న భక్తుడిని ముందుకు తోస్తూ



అన్నిగంటలు క్యూలైన్‌లో నిలబడి వస్తే లాగి పాడేస్తున్నారని పోలీసులతో భక్తుడి వాగ్వాదం

ఇటు భక్తి.. అటు బాధ్యత

దసరా శరన్నవరాత్రులలో ఒక్క రోజైనా దుర్గమ్మను దర్శించుకోవాలని ఇతర రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి వ్యయ, ప్రయాసలకు ఓర్చి భక్తులు తరలివస్తున్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి, దర్శనం కోసం రాగా.. కనులారా దర్శించుకోనివ్వకుండా పోలీసులు, భద్రతా సిబ్బంది ముందుకు లాగేస్తున్నారు అని భక్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు దాదాపు 60వేలకు పైగా భక్తులు నిత్యం అమ్మను దర్శించుకునేందుకు వస్తుండగా, వారికి దర్శనం త్వరగా జరగాలంటే ప్రతీక్షణం విలువైనదే. భక్తులు దుర్గమ్మ అలంకారాన్ని చూడకుండా కళ్లుమూసుకుని ప్రార్థిస్తున్నారని.. వారివల్ల సమయం వృథా అవుతుందని భద్రతా సిబ్బంది పేర్కొంటున్నారు. వెనుక వచ్చే భక్తులకు దర్శనం జరగాలని తప్పడం లేదంటున్నారు.

- ఈనాడు, అమరావతి

భక్తుల సంఖ్యకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో చర్చిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు, శాంతి భద్రతల ఐజీ శ్రీకాంత్

విద్యాధరపురం: దసరా వేడుకల్లో భాగంగా మూలానక్షత్రం రోజు భక్తులు అధిక సంఖ్యలో దుర్గమ్మ దర్శనానికి తరలి రానుండటతో భద్రతా ఏర్పాట్లను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీపీ రాజశేఖర్ బాబు, శాంతి భద్రతల ఐజీ శ్రీకాంత్ సోమవారం సమీక్షించారు. భక్తుల వాహనాలు ఎక్కడ నిలుపుతున్నారు... క్యూలైన్లోకి చేరే విధానం, ఘాట్ల వద్ద పరిస్థితి, ఘాట్ రోడ్డులో ఎదురవుతున్న ఇబ్బందులు, దర్శనానంతరం మల్లేశ్వరాలయ మెట్లపై నుంచి కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లు, అన్నప్రసాద స్వీకరణకు వెళ్లే పరిస్థితులను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వారు పర్యవేక్షించారు. మూలానక్షత్రం రోజున భక్తులు వచ్చే సంఖ్యకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో రామారావు, డీసీపీ గౌతమి షాలి, ఏడీసీపీ, ఏసీపీలు పాల్గొన్నారు.